




www.vibharenews.com

# విభారే

తెలుగు దినపత్రిక

VIBHARE TELUGU DAILY








PUBLISHED FROM KURNOOL | ఎడిటర్ : ఆవుల విజయ భాస్కర రెడ్డి | గురువారం | 11-05-2023 | సంపుటి : 04 | సంచిక : 223 | పేజీలు : 4 | వెల : రూ 3-00


## వర్షాలకు దెబ్బతిన్న రైతులకు ధాన్యం డబ్బులు జమ





విజయవాడ: ఆంధ్రప్రదేశ్‌లో అకాల వర్షాలకు దెబ్బతిన్న రైతులకు ధాన్యం డబ్బులు జమ చేసింది ప్రభుత్వం. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా రికార్డు సమయం..అదీ ఐదు రోజులకే ధాన్యం డబ్బుల్ని నష్టపోయిన రైతుల ఖాతాలో జమ చేయడం గమనార్హం.అకాల వర్షాలతో పంట దెబ్బ తిన్న రైతుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించాలని మొదటి నుంచి సీఎం జగన్ నేతృత్వంలోని ప్రభుత్వం భావిస్తూ వస్తోంది. ఈ క్రమంలోనే నష్టపోయిన రైతులను ఆదుకోవడమే కాకుండా.. పంట నిల్వలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలంటూ ఎప్పటికప్పుడు అధికారుల్ని ఆదేశిస్తూ వస్తున్నారాయన. ఇక ఇప్పుడు రికార్డు సమయంలో రైతులకు నగదును అందించింది. చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా 5 రోజులకే ధాన్యం డబ్బులు జమ అయ్యాయి. ఈరోజు ఒక్కరోజే 32,558 రైతులకు 474 కోట్లు జమ కాగా.. రబీ సీజన్‌కి సంబంధించి ఇప్పటివరకు రూ. 1,277 కోట్లు ధాన్యం డబ్బులు జమ చేసింది జగన్ సర్కార్.ఏపీలో ఇప్పటిదాకా 82.58 శాతం రైతులకు డబ్బులు జమ అయ్యాయి. వాస్తవానికి 21 రోజులు సమయమున్నా.. 5 రోజులకే రైతులకు చెల్లింపులు జరిగాయి. జిల్లాల వారీగా పరిశీలిస్తే.. పశ్చిమగోదావరి జిల్లా రైతులకు రూ. 527 కోట్లు, ఏలూరు జిల్లా రైతులకు రూ. 296 కోట్లు, తూర్పుగోదావరి జిల్లా రైతులకు రూ. 258 కోట్లు, కోనసీమ జిల్లా రైతులకు రూ. 100 కోట్లు జమ చేసినట్లు పౌర సరఫరాల శాఖ కమిషనర్ అరుణ్ కుమార్ వెల్లడించారు.

## సొంత ఎమ్మెల్యేలనే సీఎం నమ్మట్లేదు..



### కాంగ్రెస్ కుమ్ములాటపై మోదీ చురకలు

జైపూర్: భాజపా నాయకురాలు, మాజీ సీఎం వసుంధర రాజెను ప్రశంసిస్తూ రాజస్థాన్ ముఖ్యమంత్రి అశోక్ గహ్లోత్ చేసిన వ్యాఖ్యలు..కాంగ్రెస్ లో మరోసారి అంతర్గత కుమ్ములాటకు దారితీశాయి. ఆ వ్యాఖ్యలకు గానూ కాంగ్రెస్ నేత సచిన్ పైలట్ .. గహ్లోత్‌ను బహిరంగంగానే నిలదీశారు. ఈ నేపథ్యంలోనే తాజా పరిణామాలపై స్పందించిన ప్రధానమంత్రి నరేంద్రమోదీ .. హస్తం పార్టీకి చురకలంటించారు. ప్రస్తుతం రాజస్థాన్ పర్యటనలో ఉన్న ప్రధాని.. గహ్లోత్ సర్కారును ఎండగట్టారు. సొంత పార్టీ ఎమ్మెల్యేలపైనే సీఎంకు విశ్వాసం లేదంటూ ఎద్దేవా చేశారు.పలు అభివృద్ధి ప్రాజెక్టులను ప్రారంభించేందుకు గానూ ప్రధాని మోదీ బుధవారం రాజస్థాన్ చేరుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్‌పై విమర్శల వర్షం కురిపించారు. ''రాష్ట్ర ప్రభుత్వంలోని అందరూ ఒకరినొకరు అవమానించుకోవడంలో పోటీపడుతున్నారు. గత ఐదేళ్లుగా ఆ కుర్చీ(సీఎం పదవి) సమస్యల్లో ఉన్నప్పుడు.. రాష్ట్ర అభివృద్ధి గురించి ఆలోచించేదెవరు? ముఖ్యమంత్రి తన సొంత ఎమ్మెల్యేలనే విశ్వసించట్లేదు. అందుకే వారు కూడా ఆయనను నమ్మట్లేదు" అని మోదీ విమర్శించారు.ఇక, 2008 నాటి జైపూర్ వరుస పేలుళ్ల కేసులో నిందితులను రాజస్థాన్ హైకోర్టు నిర్దోషులుగా ప్రకటించడాన్ని మోదీ ప్రస్తావిస్తూ.. "ఆ కేసులో కాంగ్రెస్ ప్రభుత్వం గట్టిగా పోరాడలేదు. అందుకే వారంతా నిర్దోషులుగా బయటికొచ్చారు. ఉగ్రవాదంపై ఆ ప్రభుత్వం ఉదాసీనంగా వ్యవహరి స్తోంది. ఇక, కాంగ్రెస్ హయాంలో రాష్ట్రంలో శాంతిభద్రతలకు తీవ్ర విఘాతం కలుగుతోంది. ఓటు బ్యాంకు రాజకీయాల కారణంగా.. నేరస్థులపై చర్యలు తీసుకునేందుకు కాంగ్రెస్ సర్కారు భయపడుతోంది" అని దుయ్యబట్టారు.

## నిర్మల్ ఫస్ట్- వికారాబాద్ లాస్ట్: సబితా



హైదరాబాద్: పదో తరగతి పరీక్షల్లో 86.6 శాతం ఉత్తీర్ణత సాధించారని విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి తెలిపారు. తెలంగాణలో పదో తరగతి పరీక్ష ఫలితాలను మంత్రి సబితా ఇంద్రారెడ్డి విడుదల చేశారు. అమ్మాయిల ఉత్తీర్ణత శాతం 88.53 శాతంగా, బాలుర్ల ఉత్తీర్ణత శాతం 84.68 శాతంగా ఉందని వెల్లడించారు. 99 శాతం ఉత్తీర్ణతతో నిర్మల్ జిల్లా ప్రథమ స్థానంలో ఉండగా వికారాబాద్ జిల్లా (59.46 శాతం) చివరిస్థానంలో ఉంది. 2793 స్కూళ్లలో వందకు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఒక్క విద్యార్థి కూడా పాస్ కాని పాఠశాలలు 25 ఉన్నాయని వెల్లడించారు. 7492 మంది విద్యార్థులు ప్రైవేటుగా రాశారు. జూన్ 14 నుంచి 22 వరకు అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జరుగుతాయని సబితా వివరించారు. పదో తరగతి పరీక్షల్లో 4.19 లక్షల మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనారు.

## వైఎస్ జగన్ మనసున్న ముఖ్యమంత్రి: మంత్రి విడదల రజినీ



విజయవాడ: వైద్య, ఆరోగ్య రంగం పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్తశుద్ధితో పనుచేస్తున్నారని వైద్యారోగ్యశాఖ మంత్రి విడుదల రజనీ పేర్కొన్నారు.మెరుగైన సౌకర్యాలు, వైద్య సేవలు కల్పించేందుకు నిత్యం తపిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్యులు గొప్ప సేవలు అందిస్తున్నారని అన్నారు. మరింత మెరుగైన సేవలను అందించాలనే ఉద్ధేశంతోనే రెండు రోజుల శిక్షణా కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. కోవిడ్ సమయంలో వైద్యులు అందించిన సేవలు వెలకట్టలేనవని ప్రశంసించారు.ఈ మేరకు విజయవాడలో మంత్రి బుధవారం మాట్లాడుతూ.. ప్రభుత్వ వైద్యుల సేవలు ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చిపెట్టాయని మంత్రి పేర్కొన్నారు. ఆరోగ్యశ్రీలో అందించే చికిత్సలను పెంచామని, 3255 వైద్య సేవలను ఆరోగ్యశ్రీలో చేర్చారని, వైఎస్సార్ ఆరోగ్య ఆసరా పథకం దేశంలో ఎక్కడా లేదని అన్నారు. గతంలో ఎన్నడూ జరగనంతగా వైద్యశాఖలో ఉద్యోగాల భర్తీ చేస్తున్నామన్నారు. ఇప్పటికే 49వేలకుపైగా ఉద్యోగాలను భర్తీ చేశామని తెలిపారు. వైద్యానికి కావాల్సిన బడ్జెట్ పెంచాం, ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌ను అందుబాటులోకి తెచ్చామని పేర్కొన్నారు.'సీఎం జగన్ మనసున్న ముఖ్యమంత్రి. ముందస్తుగా ఆరోగ్య సమస్యలను గుర్తించడం వల్ల ఆసుపత్రులపై ఒత్తిడి తగ్గుతుంది. మెడికల్ కాలేజీలు తేవాలంటే చాలా ధైర్యం కావాలి. 17 మెడికల్ కాలేజీలు తీసుకొచ్చి జగన్ మోహన్ రెడ్డి చరిత్ర సృష్టించారు. ప్రతీ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఒక మెడికల్ కాలేజీ ఉండాలన్నదే సీఎం ఆశయం. భావితరాలకు మెరుగైన వైద్యం అందించడం కోసం సీఎం ఒక యజ్ఞం చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పెండింగ్ బిల్లులు ఇప్పటికే కొంత మేర చెల్లించాం. త్వరలోనే మిగతా వాటిని కూడా చెల్లిస్తాం. నాణ్యమైన వైద్యం అందించే విషయంలో ప్రభుత్వం రాజీ పడదు.' అని మంత్రి పేర్కొన్నారు.

## ధాన్యం అమ్ముకోలేక రైతుల ఆవేదన

### తడిసిన ధాన్యం అమ్మకాల్లో ఆలస్యం కడియం ప్రాంతంలో రైతులను పరామర్శించిన పవన్





రాజమండ్రి,మే10 : ధాన్యం ఎంత పండించినా..ఐనకాడికి ధాన్యం అమ్ముకునే పరిస్థితులు వచ్చాయంటూ జనసేనాని పవన్ కళ్యాణ్ ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే తడిసిన ధాన్యం అమ్ముకునేం దకు నానా తిప్పలు పడుతున్నారని అన్నారు. రైతులతో సుదీర్ఘంగా మాట్లాడిన పవన్.. రైతులు పడుతు న్న ఇబ్బందులు అడిగి తెలుసుకు న్నారు.. అకాల వర్షాల వల్ల కలిగి పంట నష్టంతో పాటు.. ధాన్యం కొనుగోళ్లలో ఎదుర్కొంటున్న సమస్యలను పవన్ రైతులు దృష్టికి తీసుకెళ్లారు..తూర్పు గోదావరి జిల్లాలో జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కళ్యాణ్ పర్యటించారు. రాజమండ్రి రూరల్ నియోజకవ ర్గంలోని కడియం ఆవలో అకాల వర్షాలతో పంటలు దెబ్బ తిన్న రైతాంగాన్ని పరామర్శించి, మొల కలువచ్చినధాన్యాన్ని పరిశీలి ంచా రు.. మీరు వస్తున్నారని ధాన్యం కొనుగోలు వేగవంతం చేశారని పవన్‌కి రైతులు తెలిపారు. అన్నదా తలకు న్యాయం జరిగే వరకు పోరా డతానని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. ఇంకా కోతలు కోయాల్సి వుందని, గోనె సంచులు ఇవ్వడం లేదు గోదు వెళ్లబోసుకు న్నారు.. నూక , ట్రాన్స్ పోర్ట్ పేరుతో రైతులని మిల్లర్లు దొచేస్తున్నరని పవన్ కల్యాణ్ ముందు కన్నీరుము న్నీరయ్యారు.. అంతకుముందు రాజమండ్రి విమానాశ్రయం చేరుకున్న జనసేన పార్టీ అధ్యక్షులు పవన్ కల్యాణ్‌కు స్వాగతం పలికాయి జనసేన శ్రేణులు.. అక్కడి నుంచి రాజమండ్రి నగరం బొమ్మూరు రాజవోలు మీదుగా రాజమండ్రి రూరల్ నియోజక వర్గంలోని ఆవ భూములలో దెబ్బ తిన్న వ్యవసాయ భూములు పరిశీలించి రైతులను మాట్లాడారు పవన్. అకాల వర్షాలతో జరిగిన పంట నష్టాన్ని రైతులు పవన్ కళ్యాణ్ కు వివరించారు.

## విజయవాడలో బీటెక్ విద్యార్థి అనుమానాస్పద మృతి

విజయవాడ: పెనమలూరు మండలం పెదపులిపాక గ్రామ పొలాల్లో పొట్టి శ్రీరాములు ఇంజినీరింగ్ కళాశాలలో బీటెక్ తృతీయ సంవత్సరం చదువుతున్న జీవన్ మృతి చెందిన ఘటన విజయవాడ శివార్లలో చోటుచేసుకుంది. విజయవాడలోని మాచవరం ప్రాంతానికి చెందిన బాధితుడి శరీరంపై పెట్రోల్ ఆనవాళ్లు ఉండడంతో నిప్పంటించి ఉండొచ్చని సూచిస్తున్నారు.పోలీసుల కథనం ప్రకారం? జీవన్ తన స్నేహితుడు శ్యామ్ పుట్టినరోజు పార్టీకి హాజరయ్యేందుకు ఇంటి నుండి బయలుదేరాడు. వేడుక మధ్యలో జీవన్‌కు ఫోన్ వచ్చిందని, అకస్మాత్తుగా అక్కడి నుంచి వెళ్లిపోయాడని ప్రత్యక్ష సాక్షులు చెబుతున్నారు. అనంతరం పొలాల్లో పెట్రోలు పోసి నిప్పంటించిన ఆనవాళ్లు కనిపించాయి.జీవన్‌ను హత్య చేసి ఉండవచ్చని అనుమానిస్తున్న పోలీసులు, అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. ఈ దారుణ హత్య వెనుక నిజానిజాలను వెలికితీసేందుకు అధికారులు ఈ ఘటనపై సమగ్ర విచారణ చేపట్టారు.

## ఫీజు రియంబర్స్‌మెంట్ నీరుగారింది

### జగన్ ప్రభుత్వంపై మాజీమంత్రి పీతల సుజాత విమర్శలు

అమరావతి,మే10 : జగన్ గొప్పలు, తల్లిదండ్రుల అప్పులు, విద్యార్థుల తిప్పలు అన్నట్టుగా ఫీజురీయింబర్స్ మెంట్ పథకం తయారైందని మాజీమంత్రి పీతల సుజాత విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వం బకాయిపెట్టిన రూ.1800 కోట్లను తాను చెల్లిస్తున్నానంటున్న జగన్ మాటలన్నీ పచ్చి అబద్దాలే అని తెలిపారు. వైసీపీ ప్రభుత్వం తమకు రూ.400 కోట్లు చెల్లించాలంటున్న ప్రైవేట్ విద్యాసంస్థలకు జగన్ ఏం సమాధానం చెబుతారని ప్రశ్నించారు. బకాయిలు అడిగారన్న అక్కసుతో జగన్ ప్రభుత్వం విద్యాసంస్థల యాజమాన్యా లను బెదిరించడం లేదా అని నిలదీశారు. విద్యాదీవెన, వసతిదీవెన కింద జగన్ రూ.5వేల కోట్లు చెల్లించాల్సి ఉందన్నారు. జగన్ పెట్టిన బకాయిలు విద్యార్థుల భవిష్యత్‌కు ప్రతి బంధ కాలుగా మారాయని మండిపడ్డారు.

## ముగిసిన కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల పోలింగ్..



### కర్ణాటకలో మొత్తం 224 అసెంబ్లీ స్థానాలు మే 13న వెల్లడికానున్న ఎన్నికల ఫలితాలు కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్‌ల మధ్య పోటీ

కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ బుధవారం ఉదయం 7 గంటల నుంచి మొదలైంది. ఇది సాయంత్రం 6 గంటల వరకూ కొనసాగనుంది. 40 రోజులుగా కొనసాగిన హోరాహోరీ ప్రచారంలో రెండు జాతీయ పార్టీలు, ఓ ప్రాంతీయ పార్టీకి చెందిన అగ్రనేతలు సుడిగాలి పర్యటనలు, రోడ్‌షోల్లో పాల్గొన్నారు. ప్రధానంగా బీజేపీ, కాంగ్రెస్, జేడీఎస్ మధ్య పోటీ సాగిన ఈ ఎన్నికల్లో ఇతర పార్టీలు, స్వతంత్రులతో కలిపి 224 నియోజకవర్గాల్లో మొత్తం 2,615 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. పోలింగ్ గడువు ముగియనుండగా కర్ణాటకలో ఓటర్లను ఎన్నికల అధికారులు అప్రమత్తం చేస్తున్నారు.ఇంకా 30నిమిషాలే ఉంది.. త్వరగా వెళ్లి ఓటు హక్కు వినియోగించుకోండి అని విజ్ఞప్తి చేస్తూ ట్విట్టర్‌లో పెట్టిన వీడియో ఆకట్టుకుంటోంది. సమయం ముగిసినా పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్‌లో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. సాయంత్రం 5 గంటల వరకూ 65.69 శాతం పోలింగ్ నమోదయినట్టు ఈసీ అధికారిక వెబ్‌సైట్‌లో తెలిపింది. ఆర్థిక సంక్షోభం కారణంగా గెలిచే అవకాశాలున్న 25 అసెంబ్లీ సెగ్మెంట్లలో తమ పార్టీపై ప్రభావం పడిందని జేడీ(ఎస్) నేత హెచ్‌డీ కుమారస్వామి అన్నారు. ఆర్థిక అవరోధాలు ఉన్నప్పటికీ, సీట్ల సంఖ్య పరంగా తన పార్టీ కాంగ్రెస్, బీజేపీ కంటే ముందంజలో ఉంటుందని, ఎందుకంటే తన పార్టీ కింగ్ అని, 'కింగ్ మేకర్' మాత్రమే కాదు అని మాజీ ముఖ్యమంత్రి పేర్కొన్నారుకర్ణాటక అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ మరి కాసేపట్లో ముగియనుంది. ఈ నేపథ్యంలో సాయంత్రం 6 గంటల తర్వాత ఎగ్జిట్ పోల్స్ అంచనాలు వెలువడనున్నాయి. ఎగ్జిట్ పోల్స్ ఏం చెబుతాయనే ఆసక్తి సర్వత్రా నెలకుంది. బీజేపీ, కాంగ్రెస్, జేడీ (ఎస్)ల మధ్య ప్రధాన పోటీ నెలకొనగా.. ఓటర్లు ఎవరికి పట్టం కడతారనేది ఎగ్జిట్ పోల్స్‌తో కొంత అవగాహన రానుంది. ఇటీవల పలు రాష్ట్రాల్లో జరిగిన ఎన్నికల్లో ఎగ్జిట్ పోల్స్ అంచనాలు తుది ఫలితాలకు దగ్గరగా ఉన్నాయి.కర్ణాటక ఎన్నికల పోలింగ్ సందర్భంగా అరుదైన ఘటన చోటుచేసుకుంది. బళ్లారిలోని కుర్లగిండి గ్రామంలో ఓ మహిళ పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. పోలింగ్ కేంద్రం వద్ద క్యూలైన్లో ఉన్న సమయంలో ఆమెకు పురిటినొప్పులు మొదలయ్యాయి. అక్కడే ఉన్న మహిళా ఓటర్లు, సిబ్బంది సహకరించడంతో ఆమె పండంటి బిడ్డను ప్రసవించింది. అనంతరం తల్లీ బిడ్డను పీహెచ్‌సీకి తరలించారు. ఇద్దరూ ఆరోగ్యంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు.? పోలింగ్ ముగిసిన తర్వాత, సీ-ఓటర్, లోక్‌నీతి-సీఎస్‌డీఎస్, యాక్సిస్ మై ఇండియా, టుడేస్ చాణక్యతో సహా పలు ఏజెన్సీలు తమ ఎగ్జిట్ పోల్ ఫలితాలను టెలివిజన్ ఛానెల్‌లలో విడుదల చేయాలని భావిస్తున్నాయి. కర్ణాటకలో మధ్యాహ్నం 3 గంటల వరకూ మొత్తం పోలింగ్ శాతం 52.18 శాతం దాటింది.. అత్యధికంగా హసన్ జిల్లా హోలెనరిసిపూర్‌లో 63.32 శాతం పోలింగ్ నమోదయ్యింది.

# సంపాదకీయం

గురువారం 11-05-2023

## జాతీయ వాదంతో కొత్త పుస్తకాలు

ఆరవ తరగతి నుంచి పన్నెండవ తరగతి వరకు ఎన్‌సిఇఆర్‌టి ప్రచురించిన భారత చరిత్ర పాఠ్యాంశాల్లో కొన్ని భాగాల తొలగింపు అనేక ప్రశ్నలను లేవనెత్తుతోంది. ప్రస్తుత విద్యా విధానంలో ఒక వైరి భావాన్ని ఎదుర్కోవలసి వస్తోంది.. ఒక అంశానికి సంబంధించిన మౌలిక సమాచారాన్ని ఒకే దగ్గరకు తీసుకొస్తాయి. అక్కడి నుంచి వాటి ప్రాధాన్యత ప్రకారం స్థాయి లేర్పడతాయి. కింది తరగతుల్లో తేలికగా ఉండి, పై తరగతులకు వెళ్ళిన కొద్దీ వాటి స్థాయి పెరుగుతుంది. చరిత్రను ఈ రెండు దశల్లో ఉన్న తేడాను ఎలా చూస్తారో పరిశీలిద్దాం. ఆయా అంశాల్లో విద్యార్థులు తమ జ్ఞానాన్ని పెంచుకోవడానికి వారు ప్రశ్నించేలా మంచి పాఠ్య పుస్తకాలు ప్రోత్సహిస్తాయి. జ్ఞానాన్ని పెంచుకోవడానికి ప్రశ్నలు వేయడం, ఏ అంశంలోనైనాసరే ఏ ప్రశ్నలున్నాయో అన్వేషించడం అవసరం. విద్య అనేది ఆదర్శంగా ప్రోత్సహించ డానికే ఉన్నది. ఉపాధ్యాయుడు ఒక అంశాన్ని బోధించడానికి, మన సమాజంలో, సంస్కృతిలో ఆ అంశం ప్రాముఖ్యత ఏమిటో వివరించడానికి పాఠ్య పుస్తకం తోడ్పడుతుంది. ఎన్‌సిఇఆర్‌టి ఒకటి, రెండు సెట్ల పుస్తకాలు రాసినప్పుడు అలాంటి దృష్టిని కల్పిస్తుంది. పాఠ్యపుస్తకాల్లో కోత విధించి, తొలగించేస్తే ఆ పుస్తకాల ప్రాథమిక లక్ష్యం విద్య కాదని అర్థమైపోతుంది.కోత విధించగా మిగిలిన పాఠ్యాంశాలను బోధించేటప్పుడు ఏ రకంగానూ ప్రశ్నించడానికి వీలు లేకుండా పౌరులను తయారు చేస్తాయి. విద్యను కేవలం అకారాధిక క్రమంలో నేర్చుకోవడం, ప్రాథమికంగా చదువుకోవడం కాదు. ఉన్నదానికి అతీతంగా ఆలోచించేలా ప్రోత్సహించాలి. ఇప్పుడు చేస్తున్న ఆర్థిక కేటాయింపులకు మరికొంత పెంచాలి. మనం నివసించే ప్రపంచాన్ని అర్థం చేసుకునేలా ప్రశ్నించడానికి విద్యార్థులకు, ఉపాధ్యాయులకు శిక్షణ ఇవ్వాలి. ఈ క్రమంలో చరిత్ర కీలక పాత్రను నిర్వహిస్తుంది.కొనసాగుతున్న సంఘటనలపై చరిత్ర ఆధారపడి ఉంటుంది. దానిలో చాలా భాగాన్ని తొలగించడం వల్ల ఉపాధ్యాయుల్లో, విద్యార్థుల్లో గందరగోళం నెలకొంటుంది. మధ్య యుగాలలో ఉన్న ''ముస్లింల చరిత్ర''ను మినహాయించి, ప్రాచీన కాలం నుంచి క్రీస్తు తరువాత రెండవ సహస్రాబ్దిలోకి ఎగిరి గంతేస్తే అంతులేని గందరగోళం ఏర్పడుతుంది. సంఘటనల ప్రభావాన్ని చర్చించేటప్పుడు మధ్యలో ఉన్న ఖాళీలు అడ్డుపడతాయి.వివిధ చర్యల మధ్య ఉన్న సంబంధాలను చర్చించడానికి చేసిన తొలగింపులు కీలకమైన చర్చను రద్దు చేస్తుంది. హంతకుడి ప్రస్థావన లేకుండా గాంధీజీ హత్య గురించి, హంతకుడి ఉద్దేశం ఏమిటి, ఈ సంఘటన జరిగిన తరువాత రాజకీయ పరిణామాలేమిటన్న విషయం నిజంగా ఎవరైనా చర్చించగలరా? తారీకులను పేర్కొంటూ సంఘటనలను గుదిగుచ్చడం చరిత్రకాదు. ఒక సంఘటనను చారిత్రకంగా అర్థం చేసుకోవడానికి దాని సందర్భాన్ని చర్చించడం చాలా కీలకం. అఖిల భారత స్థాయిలో పాఠ్య పుస్తకాల్లో ఎన్‌సిఇఆర్‌టి తీసుకొచ్చిన మార్పుల ప్రకటనలో గందరగోళం చోటు చేసుకుంది. ఇందులో రెండు విషయాలు ఇమిడి ఉన్నాయి. అయోమయంలో ఉండిపోయిన వారి ప్రయోజనం ఏమిటో స్పష్టంగా లేదు. వాళ్ళు చెప్పే 'హేతుబద్ధీకరణ' అర్థం ఏమిటనేది మొదటిది. పాఠశాల పాఠ్య పుస్తకాల్లో ముఖ్యంగా పదకొండు, పన్నెండవ తరగతి పాఠ్య పుస్తకాల్లో వాక్యాలు, భాగాలు, చాప్టర్లు తొలగించడాన్ని ఎలా సమర్థించుకుంటారన్నది రెండవది. తార్కికంగా, హేతుబద్ధంగా ఈ పనిచేయలేదని స్పష్టమవుతోంది.పాఠ్యాంశాల్లో మార్పులు చేయడానికి కరోనా కారణం కాదని స్పష్టమవుతోంది. ఆ సిద్ధాంతంతోనే చరిత్ర పాఠాలు చెప్పాలనే పట్టుదలతో, వాటిని అదుపులో పెట్టుకోవాలనే తమ సిద్ధాంతానికి తగినట్టుగా మార్పులు చేశారు. ఆ పేరాలు, వాక్యాలు ఎందుకు తొలగించవలసి వచ్చిందో హేతుబద్ధంగా వివరించడం ద్వారా తొలగింపులకు న్యాయం చేకూర్చవచ్చు. తొలగించినవి గమనిస్తే ఉద్దేశపూర్వకంగా చేసినట్టు స్పష్టమవుతోంది. చాలా మంది లేవనెత్తిన ప్రశ్నలకు ఎన్‌సిఇఆర్‌టి నుంచి తగిన సమాధానం లేదు. అనుమానం లేదు, వాళ్ళ పథకం సుస్పష్టం. వారి బృంద నిపుణులే రాసి ఎన్‌సిఇఆర్‌టి మూడవ సెట్‌ను అచ్చు వేస్తారు. గతంలో జరిగిన ఏదైనా సంఘటనను పన్నెండవ తరగతి చరిత్ర పాఠ్యపుస్తకంలో ప్రస్తావనకు వస్తే కేవలం ఏ విషయం పేర్కొన్నారన్న దానికి పరిమితం కాకుండా ఆ సంఘటన ఎప్పుడు జరిగింది, ఏం జరిగింది, ఎలా జరిగింది, ఎందుకు జరిగిందనేది కూడా చర్చించాలి. క్రీ.శ. 600 1800 మధ్య, 600 సంవత్సరాల మధ్యయుగాల చరిత్రలో తగ్గించేసింది కేవలం 300 సంవత్సరాల చరిత్ర కాదు. చరిత్రలో అది ప్రధాన భాగం.దీర్ఘ కాల చరిత్రలో ముఖ్యమైన సంఘటనలను ఎంపిక చేసుకుని, చర్చించి, దానికి తక్కువ ప్రాధాన్యత ఇచ్చి, స్థలాన్ని తగ్గించేశారు పాఠ్యప్రణాళికలో చరిత్ర ప్రమాణాలను పెంచేలా వారి ఉద్దేశం లేదు. పాఠ్యాంశాల్లో భాగాల తొలగింపు ఎలా ఉందంటే వారు ఎంపిక చేసిన చరిత్రలో వారు చెప్పేవే చదవాలనేట్టుగా ఉంది.మరొక గందరగోళం కూడా అంటిపెట్టుకుని ఉంది. ఎన్‌సిఇఆర్‌టి పాఠ్య పుస్తకాలను తొలుత రొమిల్లా థాపర్, అర్జున్ దేవ్, ఆర్.ఎస్.శర్మ, సతీష్ చందర్, బిపిన్ చంద్ర 196070 మధ్య రాశారు. మొరార్జీ దేశాయ్ ప్రధానిగా ఉన్నప్పుడు ఈ పుస్తకాలను నిషేధించాలని భావించారు కానీ, ఆ పని చేయడానికి ముందే ఆయన ప్రభుత్వం పడిపోయింది. నూతన చరిత్ర పుస్తకాల రచనకు 1999లో బిజెపి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.సంఘ్ పరివార్ రాజకీయాలకు అనుకూలంగా చరిత్ర రచనకు కొంత మంది చరిత్రకారులు సిద్ధమయ్యారు. బిజెపి ప్రభుత్వం 2004లో అధికారానికి రాకపోవడంతో ఇది అమలు కాలేదు. కాంగ్రెస్ నాయకత్వంలోని యుపిఎ ప్రభుత్వం తిరిగి అధికారంలోకి వచ్చాక, అప్పుడున్నపాఠ్య గ్రంథాలు 40 ఏళ్ళ క్రితం నాటివని, వాటిని తిరిగి రాయించాలని నిర్ణయించింది. కొత్త పాఠ్య పుస్తకాల్లో రెండవ సెట్‌ను చరిత్రకారులు రాశారు. వీరు గతంలో ఎన్‌సిఇఆర్‌టికి రాయలేదు. కొత్త దృక్పథంతో రాసిన వీరిని వృత్తిపరమైన చరిత్రకారులు ఎంపిక చేశారు. వారిపైన మార్క్సిస్టులు అని ముద్ర వేయలేదు. వీరు రాసిన చరిత్ర రెండవ సెట్ కూడా ప్రస్తుత ప్రభుత్వం ఆమోదించలేదు సరికదా, ప్రస్తుత ప్రభుత్వం ఆమోదించని ఈ చరిత్రకారులపైన దాడి మొదలు పెట్టారు.ఈ చరిత్ర కారులు రాసిన పుస్తకాలు రెండు దశాబ్దాలుగా మూలన పడేసి ఉన్నాయి.

# టీడీపీ గూటికి బాలినేని..?



ఒంగోలు, మే 10, బాలినేని శ్రీనివాస్ రెడ్డి ఎపిసోడ్ రోజుకో మలుపు తిరుగుతోంది. సొంత పార్టీ నేతలే తనపై కుట్ర చేస్తున్నారని ఇటీవల బాలినేని కంటతడి పెట్టుకున్నారు. పంచాయితీ సీఎం జగన్ వద్ద వరకూ వెళ్లినా కొలిక్కి రాలేదు. మంత్రి పదవి పోయినప్పటి నుంచి బాలినేని అసంతృప్తితో ఉన్నారు. మంత్రి పదవి తీసేసిన వైసీపీ అధిష్ఠానం.. ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు జిల్లాల కో-ఆర్డినేటర్ పదవి కట్టబెట్టింది. అవేవీ బాలినేనికి సంతృప్తినివ్వలేకపోయాయి. పార్టీలో తాను టికెట్లు ఇప్పించిన వాళ్లే తనను లెక్కచేయకపోవడంపై అసంతృప్తిగా ఉన్న బాలినేని.. ఇటీవల కో-ఆర్డినేటర్ పదవికి రాజీనామా చేశారు. నెల్లూరు జిల్లాలో ఎదురైన అనుభవంతో... ప్రకాశం జిల్లా పరిణామాలపై వైసీపీ అధిష్ఠానం ముందుగా స్పందించింది. బాలినేని శ్రీనివాస్ రెడ్డి తాడేపల్లికి పిలిపించి సీఎం జగన్ మాట్లాడారు.సీఎం జగన్ తో మాట్లాడినా బాలినేనిలో సంతృప్తి కనిపించలేదు. సీఎం జగన్ తో భేటీ తర్వాత ఒంగోలు వచ్చిన బాలినేని ప్రెస్ మీట్ పెట్టి సొంత పార్టీ నేతలపైనే విమర్శలు చేశారు. తనపై కుట్ర జరుగుతోందని బహిరంగంగా విమర్శలు చేశారు. తాను పార్టీ మారబోతున్నట్టు వస్తున్న వార్తలను కూడా బాలినేని తిప్పికొట్టారు. తాను ఎవరిపైనా అధిష్టానానికి ఫిర్యాదు చేయలేదని, చేయబోనన్నారు. అది తన నైజం కాదన్న ఆయన.. కానీ తనపై చాలామంది అధిష్టానానికి ఫిర్యాదు చేస్తున్నారని ఆవేదన చెందారు. పార్టీ మారుతున్నానంటూ తప్పుడు ప్రచారం చేయిస్తున్నారన్నారు.బాలినేని శ్రీనివాస్ రెడ్డి రాజీనామా చేసిన కో-ఆర్డినేటర్ బాధ్యతలను సీఎం జగన్ విజయసాయి రెడ్డికి అప్పగించారు. బాలినేని సీఎం జగన్ సమీప బంధువు అయినప్పటికీ ఉపేక్షించేది లేదన్న సంకేతాలు ఇచ్చారు. ఇటీవల సైలెంట్ అయిన విజయసాయి రెడ్డికి మళ్లీ పవర్స్ ఇచ్చారు. తాజా పరిణామాలు చూస్తుంటే ప్రకాశం జిల్లాలో వైసీపీ గట్టి ఎదురుదెబ్బ తగిలేలా కనిపిస్తుందని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ప్రకాశం జిల్లాలో బాలినేని శ్రీనివాస్ రెడ్డి వైసీపీకి కీలకనేత. పార్టీ పెట్టినప్పటి నుంచి జగన్ వెంట ఉన్న నేత. ఇప్పుడు బాలినేని పార్టీని వీడితే జిల్లాలో కోలుకోలేని దెబ్బ తగలుతుంది. అందుకే ఈ సమస్యను పరిష్కరించేందుకు వైసీపీ అధిష్ఠానం ట్రబుల్ షూటర్ గా పేరున్న విజయసాయిరెడ్డిని రంగంలోకి దింపారని సమాచారం.బాలినేని, సుబ్బారెడ్డికి మధ్య గ్యాప్ పెరిగింది. ఇటీవల ప్రెస్ మీట్ లో వైవీ సుబ్బారెడ్డిపై బాలినేని పరోక్షంగా విమర్శలు చేశారు. అలాగే విజయసాయి రెడ్డి, సుబ్బారెడ్డి మధ్య సత్సంబంధాలు లేవని సమాచారం. ఇప్పుడు శత్రువుకు శత్రువు మిత్రుడు మాదిరిగా బాలినేని, విజయసాయిరెడ్డి ఒకటి అవుతారని వైసీపీ వర్గాల్లోని జోరుగా చర్చ జరుగుతోంది.మరోవైపు బాలినేని టీడీపీ పార్టీ వైపు చూస్తున్నారని జోరుగా ప్రచారం జరుగుతోంది. గత ఎన్నికల సమయంలో కూడా బాలినేని టీడీపీ చేరతారని విస్తృతంగా ప్రచారం జరిగింది. కానీ బాలినేని వైసీపీ నుంచి పోటీ చేశారు. ఇప్పుడు పరిస్థితుల మారిపోవడంతో వైసీపీలో ఇమడలేకపోతున్నారని, త్వరలో టీడీపీ చేరతారని ప్రచారం జరుగుతోంది. టీడీపీ నుంచి ఎంపీగా పోటీ చేస్తారని కూడా టాక్ వినిపిస్తుంది.

# నాదెండ్ల స్థానంలో నాగబాబు



గుంటూరు, మే 10, జనసేన అధినేత పవన్ కల్యాణ్ తన సోదరుడు నాగబాబును పార్టీ ప్రధాన కార్యదర్శిగా నియమించారు. ఇన్నాళ్ల తర్వాత నాగబాబును ఎందుకు నియమించారన్న దానిపై చర్చ జరుగుతుంది. ప్రధానంగా కాపు సామాజికవర్గంలో ఉన్న అసంతృప్తిని పారదోలేందుకు జనసేనాని ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. ఇప్పటి వరకూ పార్టీలో పవన్ నెంబర్ వన్ అయితే.. నెంబర్ టూగా నాదెండ్ల మనోహర్ ఉన్నారు. ప్రతి జిల్లాలో నాదెండ్ల తిరుగుతూ పార్టీ క్యాడర్‌ను ఉత్సాహ పరుస్తున్నారు. పవన్ కల్యాణ్ వరస సినిమాలతో బిజీగా ఉండటంతో అంతా నాదెండ్ల తానే అయి చూసుకుంటున్నారు. జిల్లాలకు వెళ్లి మరీ సమావేశాలు జరిపి క్యాడర్‌కు దిశానిర్దేశం చేస్తున్నారు.దీంతో పవన్‌పై ఒక ముద్ర పడింది. పార్టీని నాదెండ్లకు పూర్తిగా వదిలిపెట్టడంతోనే టీడీపీకి పొత్తుల రూపంలో దగ్గర చేస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అందులో నిజం లేకపోవచ్చు. నాదెండ్ల టీడీపీతో పొత్తు పెట్టుకోవాలని సలహా ఇచ్చి ఉండవచ్చు. ఇచ్చి ఉండకపోవచ్చు. కానీ పవన్ కల్యాణ్‌ను పొత్తుల విషయంలో నాదెండ్ల తప్పుదోవ పట్టిస్తున్నారన్నది మాత్రం క్యాడర్‌లో బలంగా ఉంది. ముఖ్యంగా కాపు సామాజికవర్గంలో కూడా మెజారిటీ అభిప్రాయం ఇలాగే వినపడుతుంది. గతంలో నాదెండ్ల కారణంగా అనేక మంది నేతలు జనసేనకు దూరమయ్యారన్న విమర్శలు కూడా ఇందుకు తోడయ్యాయి. అందుకే నాగబాబును పార్టీలో తన తర్వాత స్థానంలో ఉండేలా పవన్ జాగ్రత్త పడ్డారంటున్నారు. నిజానికి పార్టీ పెట్టిన తర్వాత నమ్మకమైన మిత్రుడిగా పవన్ వెంట ఉన్నది నాదెండ్ల మాత్రమే. గత ఎన్నికల్లో ఒంటరిగా పోటీ చేసే విషయంలోనూ నాదెండ్ల నోరు మెదపలేదంటారు. కానీ 2019 ఎన్నికలు పూర్తయిన వెంటనే బీజేపీతో సత్సంబంధాలు నెరపాలన్న నాదెండ్ల సలహాను కూడా పవన్ పాజిటివ్‌గా తీసుకున్నట్లు చెబుతారు. దీనికి తోడు పవన్ కు మోదీ అంటే అమితమైన ఇష్టం కావడంతో పొత్తు సులభంగా మారింది. రాజధాని అమరావతి విషయంలోనూ పవన్ మనసు మారడానికి నాదెండ్ల కారణమని చెబుతారు. తొలి నాళ్లలో రాజధాని అమరావతిని వ్యతిరేకిస్తూ పవన్ అనేక ప్రకటనలు చేశారు. ఆ తర్వాత ఛేంజ్ కావడం వెనక మనోహర్ మంత్రాంగం ఉందంటారు. నాదెండ్ల మనోహర్‌కు రాజకీయంగా కొంత అవగాహన ఉండటంతో పవన్ ఆయనను నమ్ముతారంటారు. నాదెండ్ల విషయంలో ఎవరు ఏమి చెప్పినా పవన్ వినరన్నది జనసేన నేతలు చెప్పే మాట. అలా అందరూ చెప్పినవీ నమ్మితే ఇక పార్టీని ఎలా నడుపుతారు? ఎవరో ఒకరు సాయం ఉండాలి కదా? అన్నది పవన్ నుంచి వినపడుతున్న ప్రశ్న. నాదెండ్ల తనను మోసం చేసే వ్యక్తి కాదని, కొంత నిజాయితీ, ముక్కుసూటితనం ఉన్న నేత అని పవన్ ఇప్పటికీ నమ్ముతారు. అందుకే వేదికపై రెండు కుర్చీలుంటే. ఒకటి తనది. మరొకటి నాదెండ్లది అవుతుంది. కానీ ఇప్పుడు వేదికపై మూడో కుర్చీ వేసేశారు పవన్ కల్యాణ్. సొంత సామాజికవర్గంలో నాదెండ్ల పేరు నానుతుండటంతో నాగబాబుకు కీలక పదవి ఇచ్చారంటారు. మరి ఇప్పుడు జనంలో తిరగడం, క్యాడర్‌లో జోష్ నింపడం నాగబాబు వంతుగా మారింది. మరి నాగబాబు ఇందులో ఎంత మేర సక్సెస్ అవుతారన్నది చూడాల్సి ఉంది.

# కోటం రెడ్డి...మాములుగా లేదుగా

నెల్లూరు, మే 10, నెల్లూరు నగరంలో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ సాధన కోసం రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి పోరాటం చేస్తానని ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ పోరాటంలో భాగంగా సంతకాల సేకరణ, వాట్సప్ మెసేజ్ లను పంపే కార్యక్రమాన్ని చేపట్టారు. నెల్లూరు లోని కోటంరెడ్డి కార్యాలయానికి క్రిస్టియన్ పాస్టర్లు, క్రిస్టియన్ సోదరులు తరలి వచ్చారు. తమ తమ సెల్ ఫోన్ల నుంచి ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయ్ రెడ్డికి, జిల్లా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి వాట్సాప్ ద్వారా విజ్ఞాపనలు అందించారు. పోస్ట్ కార్డుల ద్వారా కూడా విజ్ఞాపనలు పంపించారు.క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ కోసం చేపట్టిన పోరుబాట కార్యక్రమం ఏ పార్టీకి అనుకూలంకాని, వ్యతిరేకంకాని కాదని కేవలం క్రిస్టియన్ సమాజానికి మేలు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమం అని అన్నారు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి. గత నాలుగేళ్లలో 2019లో ఒకసారి, 2021లో ఒకసారి, 2022లో ఒకసారి, స్థానిక ఎమ్.ఎల్.ఎ.గా ముఖ్యమంత్రిని కలసి, క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి 6 కోట్ల రూపాయల నిధులు మంజూరు కోసం 3 సార్లు సంతకాలు చేయించానని, అయినా పని కాలేదని అన్నారు ఎమ్మెల్యే కోటంరెడ్డి. సాక్షాత్తూ సీఎం మూడు సార్లు సంతకాలు చేసినా అతీగతీ లేదని సెటైర్లు వేశారు. జిల్లా కలెక్టర్ గారితో మాట్లాడి వేదాయపాళెం, గాంధీ నగర్లో క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ కోసం 150 అంకణాల స్థలాన్ని కూడా కేటాయించేలా చూశామన్నారు ఎమ్మెల్యే కోటంరెడ్డి. గత్యంతరం లేని పరిస్థితుల్లో అధికార పక్షానికి దూరంగా జరిగిన శాసనసభ్యుడిగా నేడు ప్రజల పక్షాన ప్రత్యక్ష పోరాటాలకు సిద్ధమయ్యానని చెప్పుకొచ్చారు. వేల మంది క్రిస్టియన్ సోదరులకు మేలు చేసే క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ నిర్మాణం కోసం కేవలం 6 కోట్లు నిధులు ఇవ్వలేరా అని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు ఎమ్మెల్యే కోటంరెడ్డి. వాట్సప్ ఉద్యమం 10రోజులపాటు కొనసాగుతుందని చెప్పారు ఎమ్మెల్యే కోటంరెడ్డి. 10 రోజులపాటు ముఖ్యమంత్రి కార్యదర్శి ధనుంజయ్ రెడ్డికి, జిల్లా మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డికి 10వేలకు పైన విజ్ఞాపనలు పంపిస్తామన్నారు. మెసేజ్ లతో వారి వాట్సాప్ క్రాష్ అయిపోవాలన్నారు. అప్పుడైనా వారు ఈ సమస్యపై దృష్టి పెడతారని చెప్పారు. అప్పటికీ సమస్య పరిష్కారం కాకపోతే ఈ నెల 22వ తేదీన ఉదయం 10 గంటలకు గాంధీనగర్ క్రిస్టియన్ కమ్యూనిటీ హాలు కేటాయించిన స్థలంలో నిరసన కార్యక్రమం చేపడతామన్నారు ఎమ్మెల్యే కోటంరెడ్డి. ఈ నెల 18వ తేదీ లోపల మంత్రులు, ఇన్ చార్జులు, ఉన్నత స్థాయి అధికారుల నుంచి స్పష్టమైన హామీ రాకపోతే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు కోటంరెడ్డి. నెల్లూరులో క్రిస్టియన్ కమ్యూనిటి హాల్ కోసం 6 కోట్లు నిధులు విడుదల చేస్తామని బహిరంగ ప్రకటన చేయకపోతే ఈ నెల 22వ తేదీన ప్రతీ చర్చి నుంచి ఒక్కో ఇటుక రాయిని తీసుకువచ్చి, క్రిస్టియన్ సోదరులతో గాంధీ నగర్ లోని క్రిస్టియన్ కమ్యూనిటీ హాల్ స్థలం వద్ద నిరసన తెలియజేస్తామని హెచ్చరించారు.

# హైకమాండ్, కేడర్ మధ్య ఐ ప్యాక్ చిచ్చు

విజయవాడ, మే 10, (న్యూస్ పల్స్) ఆంధ్రప్రదేశ్ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీలో ఇప్పుడు భిన్నమైన పరిస్థితులు కనిపిస్తున్నాయి. సీఎం జగన్‌కు అత్యంత సన్నిహితులైన వారు, వైసీపీ అంటే ఎనలేని అభిమానం చూపేవారు ఒక్కొక్కరుగా దూరమవుతున్నారు. అదే సమయంలో పార్టీ క్యాడర్‌తో హైకమాండ్‌కు దూరం పెరిగిందన్న అభిప్రాయం వినిపిస్తోంది. నెల్లూరు జిల్లాలో పార్టీ వ్యవహారాలు ఓ కుదుపు కుదిపేయగా ఇప్పుడు ప్రకాశం జిల్లాలో అలాంటి పరిస్థితి వచ్చింది. పార్టీ నేతల్లో బయటపడని అసంతృప్తి కనిపిస్తోందని గుసగుసలు ఎక్కువగానే వినిపిస్తున్నాయి. దీనికి కారణం సీఎం జగన్ ఎక్కువగా ఆధారపడుతున్న ఐ ప్యాక్ అన్న మాట మాత్రం ఐ పార్టీలో ఏకగ్రీవనంగా వినిపిస్తోంది. మొత్తం ఐ ప్యాక్ డామినేషన్ వల్లే సమస్య వస్తోందని ఆ పార్టీ నేతలు అసహనానికి గురవుతున్నారు. గడప గడపకూ మన ప్రభుత్వం అనే ఆలోచన ఐ ప్యాక్‌ది. ఆ తర్వాత జగనన్నే మా నమ్మకం.. మా భవిష్యత్ వంటి స్టిక్కర్ల ఉద్యమం కూడా ఐ ప్యాక్ ఆలోచన. ఐ ప్యాక్ వైసీపీ పార్టీ వ్యవహారాల్లో ఎంతగా చొచ్చుకుపోయిందంటే.. గడపగడపలో అంటించిన స్టిక్కర్లన్నీ ఐ ప్యాక్ అనుబంధ కంపెనీ పేరు మీదనే ప్రింట్ చేయించారు. అంటే పార్టీ మెటీరియల్ కూడా ఐ ప్యాకే సప్లయ్ చేసింది. ఇక పార్టీ రోజు వారీ వ్యవహారాల్లో కూడా ఐ ప్యాక్ కీలక పాత్ర పోషిస్తోంది. కొన్నాళ్ల కిందట సీఎం జగన్ నియోజకవర్గ సమావేశాలు పెట్టాలనుకున్నారు. కుప్పంతో ప్రారంభించారు. కొన్ని నియోజకవర్గాల్లో సమీక్షలు చేశారు. ఆ సమీక్షలకు ఎవరు రావాలి..అన్నది కూడా ఐ ప్యాకే ఎంపిక చేసింది. ఇటీవల ప్రతి నియోజకవ్రగానికి ఓ సలహాదారుడ్ని నియమించారు. ఇది కూడా ఐ ప్యాక్ చాయిసే. దీంతో అసలు పార్టీ నేతల ప్రమేయం అనేది లేకుండా పోయింది. ఐ ప్యాక్ తరపున రిషిరాజ్ అనే స్ట్రాటజిస్ట్ వ్యవహారాలన్నీ చక్క బెడుతున్నారు. ప్రతి నియోజకవర్గంలో నలుగురు ఐదుగురుతో ఉండే ఓ టీంను నియమించుకున్నారు. వారే నియోజకవర్గ వ్యవహారాలను చక్క బెడుతున్నారు. చివరికి ఎమ్మెల్యేలు ఏ ఊరికెళ్లాలి.. ఎవరితో మాట్లాడాలి.. ఎవరితో మాట్లాడకూడదన్నది కూడా వారే డిసైడ్ చేస్తున్నారన్న అసంతృప్తి ఎమ్మెల్యేల్లో కనిపిస్తోంది. సీనియర్ ఎమ్మెల్యే , మాజీ మంత్రి దశాబ్దాల పాటు రాజకీయాలు చేసిన ఆనం రామనారాయణరెడ్డిని కూడా ఐ ప్యాక్ ఇలా నియంత్రించాలనుకోవడంతో ఓ సారి సభలోనే ఐ ప్యాక్ ప్రతినిధిపై మండిపడ్డారు. ఆయన బయయపడ్డారు. చాలా మంది బయటపడలేదని చెప్పుకుంటున్నారు. పార్టీలో ఎవరిని చేర్చుకోవాలన్నా.. ఎవరినైనా బయటకు పంపాలన్నా.. ఐ ప్యాక్ ప్రతినిధులే డిసైడ్ చేస్తున్నారని అంటున్నారు. చివరికి సీఎం జగన్ దగ్గర బంధువు అయిన బాలినేని శ్రీనివాసరెడ్డి విషయంలో కూడా ముందుగా ఐ ప్యాక్ ప్రతినిధే మాట్లాడారని అంటున్నారు. వైసీపీకి ఇటీవలి కాలంలో చాలా మంది రాజీనామా చేస్తున్నారు. జగన్ కు అత్యంత విధేయుడైన విజయసాయిరెడ్డి ఇప్పుడు పార్టీ కార్యక్రమాల్లో పెద్దగా కనిపించడం లేదు. గతంలో ఆయన లేకుండా ఏ పని జరిగేది కాదు. గత ఎన్నికలకు ముందు ఐ ప్యాక్ టీం ఆయన కనుసన్నల్లోనే పని చేసేది. కానీ ఇప్పుడు ఆయన జాడలేదు. దీనికి ఐ ప్యాక్ కారణం అంటున్నారు. కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి వ్యవహారం జరగడానికి నెల్లూరులో పార్టీ చిందరవందర కావడానికి కూడా కారణం ఐ ప్యాకేనంటున్నారు. మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి.. ఓ సలహాదారుడ్ని నియమించి తనను లెక్కలోకి లేకుండా చేశారన్న కారణంతోనే పార్టీకి దూరమయ్యారు. చివరికి బాలినేని విషయంలోనూ అన్ని వేళ్లూ ఐ ప్యాక్ వైపు చూపిస్తున్నాయి. రిషిరాజ్ ఐ ప్యాక్ సిబ్బందిని విస్తృతంగా నియమించుకున్నారు. అలాగే ఇంటలిజెన్స్ వ్యవస్థను పూర్తి స్థాయిలో వాడుకుంటున్నారన్న అభిప్రాయం ఉంది. ఇక నిర్ణయాలన్నీ ఆయనే తీసుకుంటున్నారని జగన్ దాకా వెళ్లడం నేతలు ఫీలవుతున్నారు.వైసీపీ పార్టీ క్యాడర్, హైకమాండ్ మధ్య గ్యాప్ పెరిగిపోయిందన్న అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. ఎమ్మెల్యేలతో కూడా నేరుగా సీఎం జగన్ ఈ నాలుగేళ్లలో సమావేశం అయిన సందర్భం లేదు. ఏదైనా సమీక్ష పెడితే ప్రసంగించి పంపేస్తున్నారు. ముఖాముఖి మాట్లాడటం లేదు. ఎమ్మెల్యేల పరిస్థితే ఇలా ఉంటే.. ఇక ఇతర నేతల సంగతి చెప్పాల్సిన పని లేదు. అంతా ఐ ప్యాక్ చూస్తుందన్న కారణంగా జగన్ కూడా పెద్దగా పట్టించుకోవడం లేదంటున్నారు. ఫలితంగా పార్టీలో అవాంఛనీయమైన పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఎక్కువ మంది నమ్ముతున్నారు. తన మాటల్లో స్వచ్ఛత ఉందనుకుంటే, నిజాయితీ ఉందనుకుంటే, ప్రజలందరు ఈ విషయంలో తనకు అండగా నిలబడాలని కోరారు ఎమ్మెల్యే కోటంరెడ్డి. అధికార పక్షానికి దూరంగా జరిగినా రూరల్ నియోజకవర్గ ప్రజా సమస్యల పరిష్కారం కోసం అలుపెరగని, మాటతప్పని, మడమతిప్పని పోరాటాలు ప్రజల అండతో చేస్తామన్నారు

# జన్మ భూమి రుణం తీర్చుకోవాలన్నదే కాకర్ల ట్రస్ట్ అధినేత సురేష్ కోరిక

ఉదయగిరి నెల్లూరు జిల్లా ఉదయగిరి నియోజక వర్గం ఎన్నారై ఎన్నో ఉన్నత చదువులు చదువుకుని ఎంత ఉన్న స్థాయికి చేరుకొని అమెరికాలో స్థిరపడ్డప్పటికీ తనకు జన్మనిచ్చిన జన్మభూమికి ఏదో ఒకటి చేయాలని తప్పనా సంకల్పంతో ఓ ట్రస్ట్ ను ఏర్పాటు చేసి అ ట్రస్ట్ తో అనేక కార్యక్రమాలు చేపట్టి ఇటీవల కాలంలో ఎక్కడ చూసినా ఏ నోటు విన్న వినిపించే పేరు కనిపించే ఫోటో ఒక్కటే కాకర్ల సురేష్ కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ పేరుతో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తూ ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరికి నేనున్నానని భరోసానిస్తూ నిత్యం ఏదో ఒక కార్యక్రమం చేస్తే నియోజకవర్గ ప్రజలు మండల పొందుతున్న కాకర్ల చారిటబుల్ ట్రస్ట్ అధినేత సురేష్ బాబు నేడు తమ స్వగ్రామం అయినటువంటి వరికుంటపాడు మండలంలోని యర్రంరెడ్డి పల్లిలో ఆరోగ్య సంజీవని రథం నీ కాకర్ల చారిట్ర బుల్ ట్రస్ట్ అధినేత కాకర్ల సురేష్ జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా పలువురు నేతలు టెంకాయలు కొట్టారు. ఈ సందర్భంగా కాకర్ల ట్రస్ట్ అధినేత సురేష్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు,లోకేష్ స్ఫూర్తితో నియోజకవర్గంలో మరెన్నో సేవా కార్యక్రమాల్లో చేస్తానని తెలిపారు రానున్న 2024 ఎలక్షన్లో టిడిపి అధిష్టానం ఆదేశిస్తే ఉదయగిరి నియోజకవర్గం టిడిపి ఎమ్మెల్యేగా పోటీ చేస్తానని భారీ మెజార్టీతో గెలిపిస్తానని తెలిపారు. అలాగే ఈ సంజీవని రథం ఉదయగిరి నియోజకవర్గంలోని ప్రతి పల్లెకు వెళ్లి ప్రజలకు వైద్య సేవలు అందిస్తారని తెలిపారు... అత్యవసమైన ఆపరేషన్ అవసరం అయిన వారికి డాక్టర్ల సూచన మేరకు నెల్లూరులోని ప్రముఖ హాస్పిటల్ లల్లో ఆపరేషన్ చేయిస్తామని తెలిపారు.....

# ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తోనే ఆర్యవైశ్యుల సంక్షేమం

## నుడా ఛైర్మన్ ముక్కాల ద్వారకానాథ్

నెల్లూరు వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత,ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి తోనే ఆర్యవైశ్యుల సంక్షేమం జరుగుతోందని నడా చైర్మన్ ముక్కాలా ద్వారకానాథ్ పేర్కొన్నారు నెల్లూరు నగరంలోని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశం ఆయన మాట్లాడుతూ వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ పదవులతోపాటు ప్రభుత్వపరంగా ఆర్యవైశ్య సంఘీయులకు పెద్దపీట వేసిందన్నారు. అనేకమందికి రాష్ట్రస్థాయిలో ముఖ్యమైన పదవులు కేటాయించిందని అందులో భాగంగానే తనకు కూడా నుడా చైర్మన్ పదవి వచ్చిందన్న విషయాన్ని ఆయన గుర్తు చేశారు.దివంగత వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఆర్యవైశ్యులకు అభివృద్ధికి వారి సంక్షేమం కోసం చేసిన కృషి ఎనలేనిదన్నారు. మాచర్లలో జరిగిన సమావేశంలో ఆర్యవైశ్యులను ఉద్దేశించి టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ వైసీపీని ఉద్దేశించి విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. ఆర్యవైశ్యులకు ఎటువంటి మేలు చేయని తెలుగుదేశం పార్టీ నేడు ఆర్యవైశ్యుల్లో చీలిక తీసుకురావాలని కుట్ర చేస్తున్నారని ఇలాంటివి సాగవన్నారు. ఆర్యవైశ్య మహాసభ గౌరవ అధ్యక్షులుగా ఉన్న డీజే భరత్ వాస్తవాలను గమనించుకోవాలని హితవు పలికారు. వారి తండ్రి ఆర్యవైశ్య మహాసభకు అధ్యక్షులుగా ఉన్నప్పుడే మహాసభకు సంబంధించిన నిధులన్నీ ఖాళీ చేశారన్నా విషయాన్ని గుర్తు చేశారు. జీఎస్టీ విషయంలో నారా లోకేష్ కనీస అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు జీఎస్టీ కేంద్ర పరిధిలో ఉంటుందని రాష్ట్ర పరిధిలో ఉన్నట్లు ఆయన వ్యాఖ్యానాలు చేయడం శోచనీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా నేతలు శిలా సురేష్, కోటా సూరి, గాదంశెట్టి గోపాల్ సరాబు సుబ్రహ్మణ్యం, జ్యోతి ప్రసాద్, పాదర్తి బాలాజీ, పద్మప్రియ, సుప్రియ, పద్మజ, కళ్యాణి తదితరులు పాల్గొన్నారు

# అక్కడ పులులు ఉన్నాయి జాగ్రత

కర్నూలు, మే 10,శ్రీశైలం సాగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో పులుల జాడను అటవీ శాఖ అధికారులు గుర్తించారు. పులులకు సంబంధించిన అడుగులను గుర్తించిన అధికారులు వాటిని పరీక్షించి నిర్ధారించారు.అవును పులులు తిరుగుతున్నాయి..శ్రీశైలం, సాగర్ రిజర్వ్ ఫారెస్ట్ లో పులుల జాడను అటవీ శాఖ అధికారులు నిర్ధారించారు. లభించిన పగ్ మార్క్స్ ను ఆధారంగా చేసుకొని ఒక ఆడ పులి, రెండు పులి పిల్లలు ఉన్నట్లు గుర్తించారు. వెల్దుర్తి మండలంలోయపల్లి ఫారెస్ట్ లో పులులకు సంబంధించిన కీలకమైన పగ్ మార్క్స్ గుర్తింపుతో స్థానికులలో భయాందోళన వ్యక్తం అవుతోంది. అయితే భయపడాల్సిన అవసరం లేదని అటవీ అధికారులు చెబుతున్నారు. లభించిన ఆధారాలు మేరకు జనవాసాలకు దూరంగా డీప్ ఫారెస్ట్ లో పులులు సంచరిస్తున్నాయని తెలిపారు. ఇంకా ఆవాసం ఏర్పాటు చేసుకోకపోవడంతో అడవిలో స్థిరనివాసం కోసం పులులు సంచరిస్తూ ఉన్నాయని అంటున్నారు. పల్నాడు రిజర్వ్ ఫారెస్ట్, సాగర్ శ్రీశైలం రిజర్వ్ ఫారెస్ట్ మధ్య సంచరిస్తున్నట్లుగా అధికారులు భావిస్తున్నారు. జనావాసాలకు దూరంగా అడవిలో పులులు సంచరిస్తున్నాయని డిఎఫ్ఓ రామచంద్రరావు వెల్లడించారు.టెక్నాలజీతోనే పులుల జాడ గుర్తింపు..పల్నాడు అటవీ ప్రాంతంలో పులి సంచారాన్ని గుర్తించేందుకు ఫారెస్ట్ అధికారులు పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని భయపడ వలసిన అవసరం లేదని తెలియచేస్తున్నారు. పులులు సమీప గ్రామలలోకి రావని తెలిపారు. అయితే అధునాతన సాంకేతికతను ఉపయోగించి పులులకు సంబంధించిన జాడను కనుగొనేందుకు అటవీ శాఖ అధికారులు ప్రయత్నాలుసాగిస్తున్నారు. దీంతో అధికారులు ఏప్పటికప్పుడు అలర్ట్ అయి పులుల సంచారంపై నిఘా పెట్టారు. ఇప్పటివరకు పులుల సంచారంపై అంతగా అనుమానాలు లేవు. అయితే తాజాగా లభించిన ఆనవాళ్లతో అధికారులు తగిన చర్యలు తీసుకుంటున్నామని చెబుతున్నారు.ట్రాప్ కెమెరాలు ఏర్పాటు...దుర్గి మండలం గజాపురం అటవీ ప్రాంతంలో ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేశారు ఫారెస్ట్ అధికారులు. గత నెల 21వ తేదీని గజాపురం వద్దే ఆవుపై పులులు దాడి చేశాయి. కాకిరాల బీట్ లో సిసి కెమెరాలు ఏర్పాటు చేసారు. పులులు నీటి తావుల వద్దకు వచ్చే అవకాశం ఉండటంతో అక్కడ ట్రాప్ కెమెరాలను పెట్టామని ఫారెస్ట్ అధికారులు చెబుతున్నారు.ట్రాప్ కెమేరాల్లో ఇప్పటి వరకు భౌతికంగా పులులకు సంబంధించిన జాడలు లభ్యంకాలేదు.టైగర్ టెన్షన్...పల్నాడు జిల్లా దుర్గి మండలం గజాపురం సమీపంలోని అటవీ ప్రాంతంలో పులులు ఆవుపై దాడి చేసి చంపి వేసిన ఘటన వెలుగులోకి వచ్చిననాటి నుండి టైగర్ టెన్షన్ మొదలైంది. వినుకొండ, మాచర్ల రేంజ్ ఫారెస్ట్ పరిధిలో ఉన్న మూడు మండలల పరిధిలోని 24 గ్రామాలలో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. పెద్ద పులులు తమ గ్రామాలపై పడి బీభత్స చేస్తాయో అన్న టెన్షన్ గ్రామస్థులను వెంటాడు తోంది. ఈ గ్రామలలో ప్రజలు ప్రధానంగా పశు పోషనపై ఆధార పడతారు. ఆవులను, గొర్రెలను మేపేందుకు అడవులలోకి వెళుతుంటారు. గజాపురం లో పులి దాడి ఘటనతో భయాందోళనకు గురయ్యారు స్థానికులు. ఆవుపై పులి దాడి చేసిన నాటి నుంచి పశువులను తండా వాసులు అడవిలోకి తీసుకు వెళ్ళడం లేదు. ఎప్పుడు పులులు గ్రామంపై దాడి చేస్తాయోనని బిక్కబిక్కు మంటున్నారు.సర్వసిద్ధమైన ఫారెస్ట్ అధికారులుఫారెస్ట్ అధికారులు ఈ విషయాన్ని చాలా సీరియస్ గా తీసుకున్నారు. ఆవును చంపిన తర్వాత పులి జాడా ఎక్కడా నమోదు కాకకావడంతో, అధికారులు సైతం తలలు పట్టుకున్నారు. అయితే ఇప్పుడు పాదముద్రలు లభించటంతో మరింత అప్రమత్తం అయ్యారు. నాగార్జున సాగర్ రిజర్వు ఫారెస్ట్ నుంచి ఇతర పులల నుంచి విడిపోయన రెండు సంవత్సరాల వయస్సు ఉన్న పులి పిల్లలు గా భావిస్తున్నారు.

## బీజేపీ, వైసీపీ సం'బంధం'...



సంబంధాలను ప్రభావితం చేయలేకపోయాయి.కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వంతో వైసీపీకి ఎలాంటి దోస్తీ లేదు. తమ బంధం కేవలం రాష్ట్ర ప్రయోజనాలకే పరిమితం అని కొద్ది నెలల క్రితం విశాఖలో జరిగిన ప్రధాని పర్యటనలో వేదికపై ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.ఏపీలో బీజేపీతో వైఎస్సార్సీపీకి ఉన్న బంధం ఏమిటనేది చాలా మందికి క్లారిటీ లేదు. అదే సమయంలో ఎన్డీఏ భాగస్వామ్య పక్షం కాకపోయినా వైసీపీని బీజేపీ ఎందుకు ఊపేక్షిస్తుందనే అనుమానాలు కూడా ఉన్నాయి. బీజేపీ నాయకులు, కేంద్ర మంత్రులు వైసీపీ ప్రభుత్వంపై విమర్శలు గుప్పించినా అవి తాత్కలికమే. రాష్ట్ర ప్రభుత్వాన్ని ఇరకాటంలోకి నెట్టే పరిస్థితి నాలుగేళ్లలో ఎప్పుడూ బీజేపీ కల్పించలేదు.2019లో ఏపీలో వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రధాన ప్రతిపక్షంగా ఎదగాలని బీజేపీ భావించింది. రెండో స్థానంలో ఉన్న టీడీపీ నుంచి వీలైనంత మంది నాయకుల్ని చేర్చుకోవడం ద్వారా పార్టీని బలోపేతం చేయాలని భావించింది. అదే సమయంలో జనసేనతో స్నేహం, కాపులకు రాష్ట్ర పార్టీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించి ప్రధాన కులానికి తాము రాజకీయ ప్రత్యామ్నయం అవుతావనే సందేశాన్ని జనాల్లోకి పంపాలని భావించింది.కారణాలు ఏమైనా, కారకులు ఎవరైనా బీజేపీ అనుకున్నట్టు ఏపీలో ఆ పార్టీ బలోపేతం కాలేదు. అదే సమయంలో 2018కు ముందు బీజేపీ నుంచి దూరమైపోయిన టీడీపీ, బీజేపీకి దగ్గరయ్యేందుకు చేయని ప్రయత్నాలు లేవు. ఇవి కూడా పెద్దగా ఫలించలేదు. బీజేపీ కేంద్ర నాయకత్వం ఏపీలో తమ స్థానాన్ని సుస్థిరం చేసుకునే విషయంలో కొంత ఊగిసలాట వైఖరి ప్రదర్శించిందనే విమర్శలు కూడా ఉన్నాయి. టీడీపీకి దగ్గరయ్యే విషయంలో బీజేపీ కేంద్ర నాయకత్వంలో స్పష్టత ఉన్నా, వైసీపీ విషయంలోనే ఆ పార్టీ వైఖరి అంతు చిక్కడం లేదు.ఈ క్రమంలో ఏపీ సిఎం జగన్మోహన్ రెడ్డికి బీజేపీ ముద్ర వేసే ప్రయత్నాలు రాజకీయ ప్రత్యర్థులు చేస్తున్నారు. కాషాయ పార్టీలో? లేకపోయినా జగన్ కాషాయ దళంతో అంటకాగుతున్నారని సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి జగన్ ప్రత్యర్థులు ప్రయత్నిస్తున్నారు. ఏపీలో ప్రధానంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలలో వైసీపీ గట్టి పట్టు ఉంది. కాంగ్రెస్ పార్టీకి సాంప్రదాయక ఓటు బ్యాంకులుగా ఉన్న వర్గాలన్ని 2009 తర్వాత పూర్తిగా వైసీపీ వైపు మళ్లాయి. అయా వర్గాల్లో చీలిక తీసుకురావడానికి జగన్మోహన్ రెడ్డి ప్రత్యర్థులు ఈ తరహా ప్రచారాలకు తెర తీశారు.బీజేపీ తమ మిత్ర పక్షమనో, బీజేపీతో కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తామనో వైసీపీ చెప్పడం లేదు. అదే సమయంలో ఏపీలో ప్రభుత్వ వ్యతిరేక ఓటును చీలనివ్వకుండా ఉండటానికి బీజేపీ కూడా తమతో చేరాలని టీడీపీ-జనసేన కోరుకుంటున్నాయి. దీనికి బీజేపీ అంగీకరిస్తుందో లేదో కూడా తెలీదు. ప్రభుత్వ వ్యతిరేక జట్టులో సిపిఐ కూడా ఉంది. జనసేన-బీజేపీల మధ్య ఉన్న రాజకీయ అవగాహనకు ఈ కొత్త బంధాలు ఎలా సానుకూలిస్తాయనే సందేహం కూడా ఉంది. ఈ లోపు బీజేపీ “బీ ” టీమ్‌గా వైసీపీకి ముద్ర వేసే ప్రయత్నాలు మాత్రం జోరుగా సాగుతున్నాయి.

## నేడు జాతీయ సాంకేతిక దినోత్సవం

భారతదేశ సాంకేతిక పురోగతికి గుర్తుగా ఈ దినోత్సవాన్ని జరుపుకుంటారు. భారతదేశ సైన్యంజాతీయ రాజస్థాన్‌లోని ప్రోఖ్రాన్ టెస్ట్ రేంజ్ వద్ద శక్తి -1 అణు క్షిపణిని విజయవంతంగా పరీక్షించింది. ఈ పరీక్షకి దివగంత రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం నాయకత్వం వహించారు. దీనిని ఆపరేషన్ శక్తి లేదా ప్రోఖ్రాన్ -2 అని పిలిచారు. రెండు రోజుల తర్వాత ఆపరేషన్ శక్తిలో భాగంగా భారతదేశం రెండు అణ్వాయుధాలను విజయవంతంగా పరీక్షించింది. శక్తి, ప్రోఖ్రాన్, న్యూక్లియర్ టెస్ట్ , స్మైలింగ్ బుద్ధ అనే మొదటి అణు పరీక్ష 1974లో జరిగాయి. రెండో అణుపరీక్షను 1998 మే లో భారత సైన్యం ప్రోఖ్రాన్ టెస్ట్ రేంజ్ వద్ద ఐదు వరుస న్యూక్లియర్ బాంబుల పరంపరను విజయంవంతంగా పరీక్షించింది.దీంతో అప్పటి ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి భారతదేశాన్ని అణు రాష్ట్రంగా ప్రకటించడమే కాక మే 11ను జాతీయ సాంకేతిక దినంగా ప్రకటించారు. న్యూక్లియర్ క్లబ్‌లో చేరిన ఆరవ దేశంగా, అణ్వయుధాల వ్యాప్తి నిరోధక(ఎన్‌పీటీ)లో పాల్గొనని మొదటి దేశంగా నిలిచింది. 1999 నుండి టెక్నాలజీ డెవలప్‌మెంట్ బోర్డు(టీడీబీ) ఈ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తోంది. ప్రతి ఏడాది టీడీబీ ఒక కొత్త థీమ్ ని ఎంచుకుంటోంది. ఈ దినోత్సవం నిత్యజీవితంలో సైన్స్ యొక్క ప్రాముఖ్యతను తెలియజేస్తోంది.

# అమరావతిలో కొత్త జోన్ రగడ...

విజయవాడ, మే 10, హైకోర్టు ఆదేశాల తర్వాత అమరావతిలోని ఖ్5 జోన్‌లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇచ్చే పనులు వేగవంతం చేసింది ప్రభుత్వం. మొత్తం 11వందల 34 ఎకరాలను ఈ జోన్ కోసం కేటాయించారు. వీటిల్లోనే పేదలకు ఇళ్లపట్టాలు ఇస్తారు. ఒకవైపు లేఅవుట్ పనులు శరవేగంగా జరుగుతుంటే.. ఇంకోవైపు స్థానికుల నుంచి నిరసనలు తప్పడం లేదు.మంగళగిరి మండలం కురగల్లులో ఖ్5 జోన్ హద్దురాళ్లను స్థానికులు తొలగించారు. నిన్న కురగల్లుతోపాటు.. నవులూరు, యర్రబాలెం, నిడమర్రు, కృష్ణాయపాలెంలో అధికారులు పర్యటించి.. అక్కడ భూమిని చదును చేశారు. హద్దురాళ్లు పాతారు. త్వరలోనే అఖీఆం పరిధిలో కేటాయించిన ఈ భూముల్లో గుంటూరు, విజయవాడ పరిధిలోని పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వాలన్నది ప్రభుత్వం ఆలోచన. అయితే కురగల్లులో హద్దురాళ్లు తొలగించడంతో కలకలం రేగుతోంది.హైకోర్టు ఆదేశాలను స్థానిక రైతులు కొందరు ఇప్పటికే సుప్రీంకోర్టులో సవాల్ చేశారు. ప్రధాన పిటిషన్ ఇంకా పెండింగ్‌లో ఉంది. హైకోర్టు కూడా ప్రధాన పిటిషన్ తీర్పునకు లోబడే ఇళ్ల పట్టాల పంపిణీ ఉండాలని స్పష్టం చేసింది. ఈ మాటను పట్టుకునే ప్రభుత్వ తీరును తప్పుపడుతున్నారు స్థానికులు. విచారణ సుప్రీంకోర్టులో పెండింగ్‌లో ఉండగా.. ఇళ్ల పట్టాలు పంపిణీకి తొందరేముందనేది స్థానికుల వాదన. అయితే అమరావతిలో అందరికీ హక్కు ఉందని చెబుతూ? ఇళ్ల పట్టాల పంపిణీకి శరవేగంగా చర్యలు చేపడుతోంది ప్రభుత్వం.టీడీపీ మౌనం ఎందుకోరాజధాని నిర్మాణం కోసం భూములు సేకరించిన ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలనే ఏపీ ప్రభుత్వ నిర్ణయంపై ప్రధాన ప్రతిపక్షం టీడీపీ పెదవి విప్పడం లేదు. రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించే విషయంలో రైతుల అభ్యంతరాలను ఏపీ హైకోర్టు తోసిపుచ్చడంతో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించడానికి ప్రభుత్వం సిద్ధమైంది. ఎన్టీఆర్, గుంటూరుజిల్లాలకు చెందిన పలు నియోజక వర్గాల ప్రజలకు రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించనున్నారు.రాజధాని నిర్మాణం కోసం భూములు ఇచ్చిన నిడమర్రు, కృష్ణాయపాలెం, కురగల్లు, ఐనవోలు, మందడం గ్రామాల్లో ఇళ్ల స్థలాల పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. 20 లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు కేటాయిస్తున్నారు. ఈ నెల 15లోగా పనులు పూర్తి చేసి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా పట్టాలు పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. హైకోర్టు ఉత్తర్వుల మేరకు.. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల ప్రకారం గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల లబ్ధిదారులకు అయిదు గ్రామాల్లో ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి పనులు చేపడుతున్నారు. ఎన్టీఆర్ జిల్లాకు చెందిన 20వేల మందికి పైగా ఈ ప్రాంతంలో నివాస స్థలాలను కేటాయిస్తున్నారు.రాజధాని ప్రాంతంలో పేదలకు ఇళ్ళ స్థలాలుకేటాయించడానికి మూడేళ్ల క్రితమే ప్రభుత్వం ప్రతిపాదనలు చేసినా, రైతుల అభ్యంతరాలతో న్యాయపరమైన ఇబ్బందులు తలెత్తాయి. సుదీర్ఘ విచారణ తర్వాత రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాల కేటాయింపుపై రైతుల అభ్యంతరాలను హైకోర్టు తోసిపుచ్చింది. తుది ఉత్తర్వులకు లోబడి ఇళ్ల స్థలాల కేటాయింపు ఉంటుందని కొద్ది రోజుల క్రితం ప్రకటించింది. ఈ వ్యవహారంపై రాజధాని ప్రాంత రైతులు సుప్రీం కోర్టును కూడా ఆశ్రయించారు. ఇళ్ల స్థలాల కేటాయింపును నిలుపుదల చేయాలని కోర్టును ఆశ్రయించారు. వచ్చే వారం రైతుల పిటిషన్ విచారణకు రానుంది.ఆర్5 జోన్ వ్యవహారంపై టీడీపీ మౌనం వహిస్తోంది. ప్రభుత్వం రాజధాని గ్రామాల్లో పేదలకు ఇళ్ల పట్టాలు ఇవ్వడానికి వేగంగా ఏర్పాట్లు చేస్తుంటే టీడీపీ నాయకులు మాత్రం ఈ వ్యవహారంతో తమకు పట్టనట్టు వ్యవహరిస్తున్నారు. రాజధాని వికేంద్రీకరణ విషయంలో రాజధాని ప్రాంత రైతుల వెన్నంటి నడిచిన తెలుగు దేశం పార్టీ, ఆర్5 జోన్ విషయంలో వెనక్కి తగ్గినట్టు కనిపిస్తోంది.పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపును టీడీపీ వ్యతిరేకిస్తుందనే ప్రచారం ఆ పార్టీకి చేటు చేస్తుందనే అనుమానంతో టీడీపీ నేతలు మౌనం వహిస్తున్నట్టు తెలుస్తోంది. హైకోర్టు తీర్పు తర్వాత ఏపీ మంత్రులు పెద్ద ఎత్తున టీడీపీ తీరుపై విమర్శలు గుప్పించారు. పేదలకు ఇళ్ల స్థలాలను కేటాయించకుండా టీడీపీ వివాదాలు సృష్టిస్తోందని ఏపీ మంత్రులు పెద్ద ఎత్తున విమర్శలు గుప్పించారు.మరోవైపు గుంటూరు, ఎన్టీఆర్ జిల్లాల్లోని పేదలకు పెద్ద ఎత్తున రాజధాని ప్రాంతంలో కేటాయిస్తుండటం, రెండు జిల్లాల్లో ఏడెనిమిది నియోజక వర్గాలకు చెందిన ప్రజలకు ప్రభుత్వం ఇంటి స?థలాలు కేటాయిస్తుండటంతో టీడీపీ వ్యూహాత్మకంగా మౌనం వహిస్తోంది. ఎన్నికలకు ఏడాది ముందు ప్రజలకు లబ్ది కలిగించే పథకాలను వ్యతిరేకిస్తే, ప్రజల్లో తమపై వ్యతిరేకత రావొచ్చని భయపడుతోంది. వైసీపీ నేతలు ఇళ్ల స్థలాల కేటాయింపుపై టీడీపీని తప్పు పడుతున్న తమకేమి సంబంధం లేనట్టు టీడీపీ మౌనం వహిస్తోంది. ప్రభుత్వ సంక్షేమ పథకాల విషయంలో లోపాలను ఎండగట్టడానికి పరిమితం కావాలని టీడీపీ భావిస్తోంది.అమరావతిలో పేదలకు ఇళ్ల స్థలాల కేటాయింపును టీడీపీ వ్యతిరేకిస్తే, వైసీపీ చేసే విమర్శలు ఊతమిచ్చినట్టేనని టీడీపీ భావిస్తోంది. అమరావతి ప్రాంతం ఓ వర్గానికి సంబంధించిన ప్రాంతంగా వైసీపీ ఆరోపిస్తోంది. ఆ ప్రాంతంలో పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి కూడా అంగీకరించడం లేదని వైసీపీ విమర్శిస్తోంది. ఇప్పుడు ఇళ్ల స్థలాల కేటాయింపును వ్యతిరేకిస్తే వైసీపీ ప్రచారాన్ని నిజం చేసిఃనట్లు అవుతుందనే ఉద్దేశంతోనే టీడీపీ సైలెంట్ అయినట్లు కనిపిస్తోంది.

## భారత్ రెండోసారి అణుపరీక్షలు నిర్వహించింది ఈరోజే

1998లో మే నెలలో భారతదేశం రెండో అణు పరీక్షలను రాజస్థాన్ లోని పోఖ్రాన్‌లో నిర్వహించింది. వీటినే పోఖ్రాన్-2 అంటారు. 1998లో మే 11న మూడు, మే 13న రెండు మొత్తం ఐదు అణు పరీక్షలను పరీక్షించారు. అప్పటి భారత ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి. ఈ ప్రాజెక్టు కో-ఆర్డినేటర్‌లుగా ప్రధానమంత్రికి శాస్త్రీయ సలహాదారుగా వ్యవహరించిన ఎపిజె అబ్దుల్ కలామ్, అణుశక్తి సంఘం మాజీ అధ్యక్షుడు ఆర్.చిదంబరం వ్యవహరించారు. పోఖ్రాన్-2కు మరోపేరు ఆపరేషన్ శక్తి. మే 11న జాతీయ సాంకేతిక దినంగా జరుపుకొంటారు.

## బందరు డిఎస్పీగా వై మాధవరెడ్డి

మచిలీపట్నం బందరు డిఎస్పీగా వై మాధవరెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా అమలాపురం ఎస్డిపిఓ గా పనిచేస్తున్న మాధవరెడ్డిని బందరు బదిలీ చేస్తూ రాష్ట్ర డి జి పి ఉత్తర్వులు జారీ చేశారు. బందర్ డిఎస్పీగా పని చేస్తున్న మాసుం భాష ఇక్కడి నుండి బదిలీ కాగా ఆయన స్థానంలో మాధవరెడ్డి బాధ్యతలు అందుకున్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం జిల్లా ఎస్పీ పి జాషువా ను మాధవరెడ్డి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. బందర్ డిఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన మాధవరెడ్డిని ఎస్పీ జాషువా అభినందించారు. బందర్ సబ్ డివిజన్లోని సిఐలు, ఎస్ఐలు, ఇతర సిబ్బంది డీఎస్పీకి ఘన స్వాగతం పలికారు.

## టిడ్కో ఇళ్లు ఇవ్వాలని అందోళన

విజయవాడ రాజధాని అమరావతిలోని 5 వేల టిడ్కో ఇళ్లను పేదలకు వెంటనే ఇవ్వాలని కోరుతూ తాళ్లాయపాలెం టిడ్కో గృహ సముదాయాలు వద్ద సిపిఎం ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. కార్యక్రమానికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ .బాబురావు, ఎం. రవి, లబ్ధిదారులు హాజరయ్యారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయి ఐదేళ్లు గడిచినా ఇళ్లు ఇవ్వకుండా రాజధాని పేదలను రాష్ట్ర ప్రభుత్వం మోసం చేస్తున్నదని అన్నారు. రాజధాని రైతులు, పేదల మధ్య చిచ్చు బెట్టి పబ్బం గడుపుకోవాలని చూస్తున్నారని అన్నారు. రాజధాని పేదలకు ఇళ్లు, స్థలాలు ఇవ్వకపోతే ఉద్యమం తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.

## రోడ్ల నిర్మాణానికి అత్యధిక ప్రాధాన్యత

ఎమ్మిగనూరు పట్టణాభివృద్ధి లో భాగంగా పట్టణంలోని 28వ వార్డు వెంకటాపురం నందు సీసీ రోడ్డు నిర్మాణ పనులను భూమి పూజ నిర్వహించిన”ఎర్రకోట జగన్మోహన్ రెడ్డి, ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ అభివృద్ధికి ఎమ్మెల్యే ఎర్రకోట చెన్నకేశవ రెడ్డి సహకారం అన్ని వార్డుల్లో పనులు జరుగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ బజారి, మున్సిపల్ చైర్మన్ డాక్టర్ కెయస్. రఘు, వైస్ చైర్మన్ డి. నజీర్ ఆహ్మద్, మున్సిపల్ కమిషనర్ ఎన్. గంగిరెడ్డి, డిఈఈ మనోహర్ రెడ్డి, ఏఇ ప్రవీణ్ కుమార్ రెడ్డి, జిల్లా వక్ఫ్ బోర్డు ఉపాధ్యాక్షులు రియాజ్ ఆహ్మద్, పట్టణ అధ్యక్షుడు బుట్టా రంగయ్య, ప్రధాన కార్యదర్శి బసరకొడు వీరేంద్ర, అధికార ప్రతినిధి కె. సునీల్ కుమార్, టౌన్ బ్యాంక్ చైర్మన్ యూకె. రాజశేఖర్, కౌన్సిలర్లు, ఇన్ చార్జ్ లు, నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## టీడీపీ నేత షాపు కూల్చివేత

గన్నవరం టిడిపి నాయకులు పి. ఎసి.ఎస్ మాజీ అధ్యక్షుడు మాధల శ్రీనివాసరావు పురుగులు మందు షాప్ ను రెవిన్యూ అధికారులు కూల్చివేసారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇదేమి కర్మ కార్యక్రమం లో భాగంగా గుడివాడ నుండి హనుమాన్ జంక్షన్ మీదుగా వెళ్తున్న చంద్రబాబు కి శ్రీనివాస రావు స్వాగతం ప్లాక్సీ లు కట్టిన విషయం తెలిసిందే. అది తట్టుకోలేని స్థానిక ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఇరిగేషన్ అధికారులు,రెవిన్యూ అధికారులు పై ఒత్తిడి తెచ్చి పడగొట్టించాడని బాధితుడు అంటున్నారు. పడగొట్టే ముందు షాప్ కి అధి?కారులు నోటీస్ అంటించారు. పోలీసులు అండ తో దగ్గర ఉండి షాప్ జే.సి.బి సహాయం తో పడగొట్టించారు. శ్రీనివాసరావు పురుగులు మందు షాప్ దగ్గర వచ్చిన టిడిపి నాయకులు కొనకళ్ల నారాయణ మీడియాతో మాట్లాడారు. ఇది కావాలని స్థానిక ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అధికారులూ అడ్డం పెట్టుకొని పడగొట్టించారు. గత 25 సంవత్సరాలుగా శ్రీనివాసరావు షాప్ పెట్టుకొని జీవిస్తున్నాడు. టి.డి.పి పార్టీ అంటే చాలా అభిమానం శ్రీనివాసరావుకు. స్థానిక ఎమ్మెల్యే వల్లభనేని వంశీ శ్రీనివాసరావుకు బెదిరింపులు కూడా వచ్చయి.

# సోము దెబ్బ... కమలంలో ఏం జరుగుతోంది

విజయవాడ, మే 10, ఆంధ్రప్రదేశ్ బీజేపీ తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తున్న పార్టీ నేతలకు బయటకు పంపాలనే చూస్తుంది. ఎన్నికల ముందే వీరిని వదిలించుకోవాలని చూస్తుంది. పార్టీలో ఉంటూ కోవర్టులుగా ఉన్న వీరిని వీలయినంత త్వరగా పార్టీ నుంచి బయటకు పంపడమే మేలని భావిస్తుంది. ఇప్పటికే ఇద్దరు బీజేపీ నేతలకు పార్టీ రాష్ట్ర కార్యాలయం నుంచి షోకాజ్ నోటీసులు అందాయి. వీటికి సమాధానం చెప్పిన తర్వాత అవసరమైన చర్యలు తీసుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకత్వం నిర్ణయిస్తుంది. కర్ణాటక ఎన్నికల ప్రచారం పూర్తి కావడంతో వీరి వ్యవహారాన్ని అధినాయకత్వం దృష్టికి కూడా తీసుకెళ్లే ప్రయత్నం చేస్తుంది. ఇటీవల ఒక న్యూస్ ఛానల్‌లో విశాఖ బీజేపీ నేత విష్ణుకుమార్ రాజు చేసిన వ్యాఖ్యలను బీజేపీ రాష్ట్ర నాయకత్వం సీరియస్‌గా తీసుకుంది. తెలుగుదేశం పార్టీతో పొత్తు ప్రస్తావన, బీజేపీ ఒక్క సీటు కూడా గెలవలేదని మోదీకి తాను చెప్పానని చెప్పడం వంటి కారణాలపై ఆయన సంజాయిషీని కోరింది. అయితే తాను గతంలో మోదీకి ఒంటరిగా వెళితే బీజేపీకి ఏపీలో ఒక్క సీటు కూడా రాదని లేఖ రాశానని విష్ణుకుమార్ రాజు వివరణ ఇచ్చినట్లు తెలిసింది. అయితే దీనిపై రాష్ట్ర నాయకత్వం కూడా కేంద్ర నాయకత్వమే చర్యలు తీసుకునేలా ప్లాన్ చేసినట్లు సమాచారం. త్వరలోనే విష్ణుకుమార్ రాజును పార్టీ నుంచి సస్పెండ్ చేసే అవకాశాలున్నాయని పార్టీ వర్గాల ద్వారా తెలుస్తుంది.ఇక మరో కీలక నేతకు కూడా బీజేపీ రాష్ట్ర నాయకత్వం షోకాజ్ నోటీసులు జారీ చేసింది. మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్‌కు ఈ నోటీసులు జారీ చేసింది. నారా లోకేష్ కర్నూలు నగరంలో పాదయాత్ర చేస్తుండగా ఆయనకు స్వాగతం పలుకుతూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలలో టీజీ వెంకటేష్ ఫొటో ఉండటంపై వివరణ కోరింది. టీజీ వెంకటేష్ బీజేపీలో ఉండగా, ఆయన కుమారుడు టీజీ భరత్ మాత్రం కర్నూలు టీడీపీ ఇన్‌ఛార్జిగా ఉన్నారు. అయితే బీజేపీలో ఉంటూ టీడీపీతో లోపాయికారీ ఒప్పందం చేసుకున్నారన్న విమర్శలు వినిపిస్తుండటంతో ఈ షోకాజ్ నోటీసులు జారీ చేసినట్లు తెలిసింది ఇక ముందు ఇలాంటి ఇబ్బందులు రాకుండా ఒకే కుటుంబంలో ఉండేవారు ఒకే పార్టీలో ఉండేలా తీర్మానం చేయాలని పార్టీ నాయకత్వం భావిస్తుంది. అలా తీర్మానం చేస్తే ఉన్నవాళ్లు ఉంటారు.. ఇష్టం లేని వాళ్లు పార్టీ నుంచి వారంతట వాళ్లు వెళ్లిపోతారని భావిస్తున్నారు. జమ్మలమడుగులోనూ ఆదినారాయణ కుటుంబంలో కొందరు టీడీపీలోనూ,



ఆదినారాయణ రెడ్డి బీజేపీలోనూ కొనసాగుతున్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన కలసి పనిచేస్తాయని ఇటీవల వ్యాఖ్యానించిన ఆదినారాయణరెడ్డికి కూడా నోటీసులు జారీ చేసింది. వీరందరిపై చర్యలు తీసుకునే దిశగా పార్టీ నాయకత్వం ప్రయత్నిస్తున్నట్లు తెలుస్తోంది. కేంద్ర నాయకత్వం నుంచి అనుమతి తీసుకుని త్వరలోనే ఈ ముగ్గురిపై వేటు పడే అవకాశాలున్నాయి.నాకు నోటీసులాసోము వీర్రాజు షోకాజ్ కు మాజీ రాజ్యసభ సభ్యుడు టీజీ వెంకటేష్ స్పందించారు. తన కుటుంబ సభ్యులు టీడీపీలో ఉన్నారని, అది అందరికీ తెలుసునని టీజీ అన్నారు. కొత్తగా సోము వీర్రాజు నోటీస్ ఇచ్చేది ఏంటి అని ఆయన ప్రశ్నించారు. తనకు షోకాజ్ నోటీసు ఇవ్వడం హాస్యాస్పదమని టీజీ వెంకటేష్ కొట్టిపారేశారు. మరి దగ్గుబాటి సంగతేంటో? అలాగయితే దగ్గుబాటి పురంధరేశ్వరి బీజేపీ నుండి పోటీ చేసిందని, దగ్గుబాటి వెంకటేశ్వర రావు వైసీపీ నుండి పోటీ చేశారన్న విషయాన్ని టీజీ వెంకటేష్ గుర్తు చే?శారు. దగ్గుబాటి పురంధరేశ్వరికి ఒక న్యాయం, తనకో న్యాయమా అంటూ ఆయన ప్రశ్నించారు. షోకాజ్ నోటీసులకు భయపడేది లేదని వెంకటేష్ అన్నారు.

## విద్యార్థులు, ఉపాధ్యాయులకు అభినందనలు

కాకినాడ ఇటీవల విడుదలైన పదో తరగతి ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి, ఉత్తమ ప్రతిభ కనబరిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులను, పాఠశాల ప్రధానోపాధ్యాయులను, ఉపాధ్యాయులను, తల్లిదండ్రులకు కాకినాడ జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో కలెక్టర్ కార్యాలయంలో ప్రత్యేక అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా కలెక్టర్ డా. కృతికాశుక్లా.. ఆర్‌జేడీ జి.నాగమణి, విద్యా శాఖ అధికారులతో కలిసి.. 600లకు 575 పైబడి మార్కులు సాధించిన 31 మంది ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేసి, బహుమతుల ప్ధదానం చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ఉపాధ్యాయులను ఉద్దేశించి జిల్లా కలెక్టరు కృతికా శుక్లా మాట్లాడుతూ పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు, పాఠాలు బోధించిన ఉపాధ్యాయ బృందాలకు శుభాకాంక్షలు, అభినందనలు తెలియచేస్తున్థట్లు తెలిపారు. పేదరికం నుంచి బయటపడడానికి, ప్రస్తుత సమాజంలో ఉన్నత స్థాయికి చేరుకోవడానికి కేవలం చదువు ఒకటే మార్గం అని ఆమె పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా, వైద్య రంగాలకు అధిక ప్రాధాన్యతనిచ్చి వేల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తోందన్నారు. కుటుంబం, పాఠశాల పరిసరాలు పిల్లలపై అధిక ప్రభావాన్ని చూపిస్తాయనే అంశాన్ని దృష్టిలో ఉంచుకొని రాష్ట్ర ప్రభుత్వం మన బడి నాడు నేడు కింద జిల్లాలో ప్రభుత్వ పాఠశాలల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించడం జరిగిందన్నారు. పదో తరగతి పరీక్ష ఫలితాలలో ప్రభుత్వ పాఠశాలలకు సంబంధించి చాలామంది విద్యార్థులు కొన్ని సబ్జెక్టుల్లో నూటికి నూరు శాతం మార్కులు పొందడం అభినందనీయం అని కలెక్టరు తెలిపారు. పదవ తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులందరూ మంచిగా కెరియర్ ప్లాన్ చేసుకుని మంచి కళాశాలలో ఇష్టమైన సబ్జెక్టులను అభ్యసించాలన్నారు. ఇదే స్ఫూర్తిని భవిష్యత్తు తరగతుల్లోనూ కొనసాగించి జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకునేందుకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కలెక్టర్ ఈ సందర్భంగా తెలిపారు.

## పట్టణంలో పారిశుధ్యం పై ఆకస్మిక తనిఖీలు



నంద్యాల మా ప్రతినిధి మే 10 విభారె న్యూస్ :- నంద్యాల పట్టణంలో బుధవారం నాడు ఉదయం సంజీవ నగర్ గేటు. బొమ్మలసత్రం. రామనాథ్ రెడ్డి నగర్. రైతు బజారు. టిటిడి రోడ్డు . శానిటేషన్ పై. డ్రైనేజీ. గురించి పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు . పారిశుధ్యంపై తనిఖీలు నిర్వహించిన కమిషనర్ రవి చంద్రా రెడ్డి. పారిశుధ్య కార్మికులకు నిర్వహణపై పలు సూచనలు చేశారు.. కమిషనర్ వెంట హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి. శానిటేషన్ ఇన్స్పెక్టర్ లక్ష్మి నారాయణ. శివ ప్రసాద్ రెడ్డి . డీఈ జయ భారత్ రెడీ. మున్సిపల్ సిబ్బంది . సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## పివి రావు 74 వ జయంతి వేడుకలు మాల మహానాడు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు



ఎమ్మిగనూరు -- ఎమ్మిగనూరు పట్టణంలోని స్థానిక సంజీవ నగర్ లోని మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల నరసన్న తన స్వగృహం నందు పివి రావు (పోతుల. విగ్నేశ్వర రావు) 74 వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాల నరసన్న మాట్లాడుతూ మాల మహానాడు వ్యవస్థాపకుడు పివి రావు అని, అంబేద్కర్ భావజాలంతో ఆయన సిద్ధంతో ముందుకు నడిచిన మహనీయుడు పివి రావు, మాలలు అందురు కలసి రాజ్యాధికారం కోసం పోరాటం చెయలని, మాలల కోసం అహర్నిశలు కృషి చేయడం జరిగిందని తెలిపారు. కొంతమంది కులం ను అడ్డం పెట్టుకుని నాయకులు గా వచ్చి రాజకీయ పార్టీలకు అమ్ముడుపోయారని, అలా కాకుండా కులం కు మరియు కులస్తులకు న్యాయం చేయాలని కోరారు.

# సేవా దృక్పధంతో బ్యాంక్ లు పనిచేయాలి

### బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచ్ ప్రారంభోత్సవంలో జేసీ నిశాంతి



నంద్యాల మా ప్రతినిధి మే 10 విభారె న్యూస్ :-వ్యాపార కోణంలో కాకుండా సేవా దృక్పధంతో ప్రజలకు రుణాలు మంజూరు చేసి వారి అభివృద్ధికి దోహదపడాలని జిల్లా జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి బ్యాంకు నిర్వాహకులకు సూచించారు. బుధవారం నంద్యాల పట్టణం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర నంద్యాల బ్రాంచ్ బ్యాంకును, ఎటిఎం సెంటర్ ను జోనల్ మేనేజర్ జివస్డి ప్రసాద్, బ్రాంచ్ మేనేజర్ వి. హరి క్రిష్ణలతో కలిసి జిల్లా జాయింట్ కలెక్టర్ టి. నిశాంతి లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా జేసి మాట్లాడుతూ మహారాష్ట్ర బ్యాంకు సేవలు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకు వెళ్లాలన్నారు. బ్యాంక్ అఫ్ మహారాష్ట్ర 36వ బ్రాంచ్ ను నంద్యాల జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. అనంతరం జోనల్ మేనేజర్ మాట్లాడుతూ విజయవాడ కేంద్రంగా ఏపీలో 36వ శాఖ ఏర్పాటు చేయడం జరిగిందని, అందరికి అనుకూలంగా ఉండే స్కీమ్ లు అందుబాటులో ఉన్నాయన్నారు. వ్యాపారులకు, వ్యవసాయదారులకు, ఉద్యోగులకు పారిశ్రామికవేత్తలకు అనుకూలంగా అవకాశాలు ఉంటాయన్నారు. ప్రతి జిల్లా లో రెండో శాఖ ఏర్పాటు కు సన్నాహాలు జరుగుతున్నాయన్నారు. 43శాఖలతో బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర వృద్ధిలో ఉండబోతుందన్నారు.గత ఏడాది బ్యాంక్ అభివృద్ధి చూస్తే 4 లక్షల 9 వేల కోట్ల వ్యాపారం తో ముందుందన్నారు.ప్రతి సెక్టర్ లో కూడా అభివృద్ధి లో అన్ని బ్యాంకుల కంటే ముందంజ లో ఉందని,16,1600 కోట్లు నికర లాభం తో ముందుందన్నారు. అతి తక్కువ ఎం పీ ల్ తో ప్రతి సెక్టర్ లో కూడా డిపాజిట్ లలోనూ అటు అడ్వాన్స్ లలో వృద్ధి సాధించడం జరుగుతుందన్నారు. రాబోయో కాలంలో బ్యాంకు ఆఫ్ మహారాష్ట్ర బ్రాంచిలను పెంచుతామని ఆయన అన్నారు. ప్రతి కస్టమర్ ను సంతృప్తి పరచడమే బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర ఉద్దేశ్యమన్నారు.బ్రాంచులు ఏర్పాటు చేసిన ప్రతిచోట ఎటిఎం సెంటర్ లు ప్రారంభించడంజరుగుతుందన్నారు. కస్టమర్ లకు అవసరం అనుకుంటే నంద్యాల పట్టణం లో మరో ఎటిఎం ను ఏర్పాటు చేస్తామన్నారు.నంద్యాల బ్రాంచ్ మేనేజర్ హరిక్రిష్ణ మాట్లాడుతూ ప్రజలకు హోసింగ్ లోన్స్, రీటైల్ లోన్స్, రైస్ మిల్లులకు కోల్డ్ స్టోరేజ్ ల ఏర్పాటుకు బిజినెస్ లోన్స్ ఇవ్వడం జరుగుతుందన్నారు.తక్కువ శాతం తో 84.0 నుండి హోసింగ్ లోన్ ప్రారంభంఅవుతుందన్నారు.కస్టమర్ లకు మా బ్యాంక్ ద్వారా ఉత్తమ సేవలు అందిస్తామని తెలిపారు. మెడిసేవ అధినేత మల్లు రామచంద్రారెడ్డి, పరంజ్యోతి, పీరా, పలువురు సీనియర్ కస్టమర్ లను జోనల్ మేనేజర్, బ్రాంచ్ మేనేజర్ లు సన్మానించారు. కార్యక్రమం లో బ్యాంక్ సిబ్బంది, కస్టమర్ లు పాల్గొన్నారు.

## సుప్రీం కోర్టు విచారణలో వున్న అంశంపై దేశ హోమ్ మంత్రి వ్యాఖ్యలు అభ్యంతరకరం.



నంద్యాల ,కాంగ్రెస్ నంద్యాల పార్లమెంటు జిల్లా డిసిసి అధ్యక్షులు మరియు ఏఐసీసీ మెంబర్ జై లక్ష్మి నరసింహ యాదవ్.దేశ హోమ్ మంత్రి అమిత్ షా ముస్లిం రిజర్వేషన్ల పై చేసిన వ్యాఖ్యలు సుప్రీం కోర్టును అవమానపరచే విధంగా ఉన్నాయని అమిత్ షా పై కాంగ్రెస్ నంద్యాల పార్లమెంటు జిల్లా అధ్యక్షులు మరియు ఏఐసిసి మెంబర్ జంగిటి లక్ష్మి నరసింహ యాదవ్ విమర్శనాస్త్రాలు సంధించారు.అత్యున్నత పదవిలో కొనసాగుతు అత్యున్నత న్యాయస్థానం విలువలు తగ్గించేలా మాట్లాడడం దురదృష్టకరం అని ఆయన వ్యాఖ్యానించారు.హోమ్ మంత్రి అమిత్ షా ఇటువంటి వ్యాఖ్యలు చేయడం వల్ల,సామాన్యులకు న్యాయ వ్యవస్థలపై నమ్మకం పోతుందని లక్ష్మి నరసింహ యాదవ్ అన్నారు.అమిత్ షా సుప్రీం కోర్టు పరిధిలోని అంశంపై అనుచిత వ్యాఖ్యలను సుమోటో గా స్వీకరించి తదనుగుణంగా చర్యలు తీసుకోవాలని గౌరవ కోర్టు వారిని కోరుతున్నట్లు లక్ష్మి నరసింహ యాదవ్ తెలిపారు.

# ప్రతి రోజు 100 ఇళ్ల స్టేజ్ కన్వర్షన్ జరిగేలా చర్యలు తీసుకోండి



కర్నూలు, మే, 10 : ప్రతి రోజు 100 ఇళ్లు స్టేజ్ కన్వర్షన్ జరిగేలా చూడడంతో పాటు ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్

### ఇళ్ల నిర్మాణాలను వేగవంతంగా పూర్తి చేయండి : జిల్లా కలెక్టర్ డా.జి.సృజన

డా.జి.సృజన హౌసింగ్ అధికారులను ఆదేశించారు.×బుధవారం ఆదోని పట్టణంలోని నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంలో భాగంగా జగనన్న కాలనీలో చేపడుతున్న ఇళ్ళ నిర్మాణాలను జిల్లా కలెక్టర్ డా.జి.సృజన ఆదోని శాసన సభ్యులు సాయిప్రసాద్, ఎమ్మెల్సీ డా.మధుసూధన్, ఆదోని సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ లతో కలిసి పురోగతిని పరిశీలించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డా.జి.సృజన ఆదోని పట్టణంలోని ఇళ్ల నిర్మాణాల పురోగతిపై హౌసింగ్ సిబ్బందిని ఆరా తీయగా లేఅవుట్ లో మొత్తం 5001 ఇళ్లు మంజూరు అందులో బేస్మెంట్ లెవెల్ లో 1248, రూఫ్ లెవెల్ - 30, ప్లింత్ భీమ్ - 3037, ప్లింత్ కాంక్రీట్ లెవెల్ - 82, లింటెల్ లెవెల్ - 2 మిగిలనవి 702 ఇంకా మొదలు కాలేదని హౌసింగ్ సిబ్బంది జిల్లా కలెక్టర్ కు వివరించారు. ఇంటి నిర్మాణానికి ఉపయోగించే సామాగ్రి వర్షం నీటిలో



అలానే ఉండడం పట్ల సదరు సామాగ్రి పాడు అయ్యే అవకాశం ఉందని నీటిని మోటార్ ద్వారా పంప్ చేసి బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్ ప్రతినిధిని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. అలా వర్షపు నీటికి పాడవకుండా ఎత్తైన ప్రదేశంలో సామగ్రిని నిల్వ చేసుకోవాలన్నారు.

# బాలయ్య బర్త్ డేకి 109..110 ఒకేసారా?



'గాడ్ ఆఫ్ మాసెస్' బాలకృష్ణ బర్త్ డే కి డబుల్...ట్రిపుల్ ట్రీట్ ప్లాన్ చేస్తున్నారా? 109..110వ చిత్రాలకు సంబంధించిన అప్ డేట్ ఆ రోజున రాబోతుందా? వాటితో పాటు 108 ట్రీట్ డబుల్ కిక్క్ ని ఇవ్వబోతుందా? అంటే అవుననే ప్రచారం మొదలైంది. ఇప్పటికే బాలకృష్ణ 109..110వ చిత్రాలకు సంబంధించి చర్చలు జోరుగా సాగుతున్నాయి. పలు దర్శకులతో బాలయ్య చర్చలు జరుపుతున్నారు. కొన్ని స్టోరీలు లాక్ చేసి పెట్టారు. ఈ రేసులో సీనియర్ దర్శకులతో పాటు యువ దర్శకులున్నారు.తనయుడు మోక్షజ్ఞ పేరు కూడా వినిపిస్తుంది. ఆయన హీరోగా నటించనున్న సినిమాతోనో? మోక్షని లాంచ్ చేయాలని భావిస్తున్నారు. అది 109వ చిత్రమా? 110వ చిత్రంతోనా? అన్నది క్లారిటీ లేదు. ఇలా రకరకాల సందేహాల నడుమ ఆ రెండు చిత్రాలు నలుగుతున్నాయి.జూన్ 10న బాలయ్య పుట్టిన రోజు సందర్భంగా వాటన్నింటి పై వివరణ ఇచ్చే అవకాశం ఉందంటున్నారు. ఏపీలో 2024 ఎన్నికలు సమీపిస్తో న్న నేపథ్యంలో 109వ సినిమా 'అఖండ-2' అయితే బాగుంటుందని..అందుకోసం బోయపాటి అయితేనే కరెక్ట్ అని అభిమానులు సైతం భావిస్తున్నారు.పొలిటికల్ బ్యాక్ డ్రాప్ లోనే 'అఖండ-2' చేస్తే బాగుంటుందని ఇప్పటికే నెట్టింట కథనాలు వెడెక్కిస్తు న్నాయి. అయితే వీటన్నింటిపై గాడ్ ఆఫ్ మాసెస్ వచ్చే నెలలో క్లారిటీ ఇచ్చే అవకాశం ఉందని ఇన్ సైడ్ జోరుగా ప్రచారం సాగుతోంది. బాలయ్య పుట్టిన రోజు వేడుకలు అంటే అంబరాన్ని అంటాల్సిందే. ప్రతీ ఏడాది ఎంతో ప్రతిష్టాత్మకంగా వేడుకలు నిర్వహిస్తారు. అందులోనూ అభిమానులు పెద్ద ఎత్తున సెలబ్రేట్ చేస్తుంటారు.వాళ్ల కోసం సమ్ థింగ్ స్పెషల్ గా సినిమా అనౌన్స్ మెంట్స్ లాంటివి ఇచ్చి తృప్తి పరచడం బాలయ్య ప్రత్యేకత. మరి ఈసారి అదే సన్నివేశాన్ని రిపిటీ? చేస్తారా? కొత్తగా ఇంకేదైనా చేస్తారా? అన్నది చూడాలి. ప్రస్తుతం 108వ సినిమా అనీల్ రావిపూడి దర్శకత్వంలో చేస్తోన్న సంగతి తెలిసిందే. ఆ సినిమా టీజర్ సైతం ఆరోజున రిలీజ్ చేస్తారని అభిమానులు భావిస్తున్నారు. మరి అనుకున్న అప్ డేట్స్ అన్ని జూన్ 10న వస్తే గనుక అభిమానుల ఆనందానికి అవధులుండవ్.


# ప్రభాస్ మన మీడియానే పట్టించుకోవట్లేదా?

టాలీవుడ్ ఆరడుగుల అందగాడు డార్లింగ్ ప్రభాస్ ప్రస్తుతం పలు సినిమాల్లో నటిస్తూ బిజీగా గడుపుతున్నారు. యంగ్ రెబల్ స్టార్ హీరోగా ఇటీవలే నటించిన చిత్రం ఆదిపురుష్. ఈ చిత్రంలో ప్రభాస్ శ్రీరామ చంద్రుడిగా కృతి సనన్ సీతగా కనిపించబోతున్నారు. అలాగే సైఫ్ అలీఖాన్ రావణాసురుడిగా నటించారు. అయితే ఈ చిత్రాన్ని జూన్ 16వ తేదీన ప్రపంచవ్యాప్తంగా రిలీజ్ చేయబోతున్నారు.తెలుగుతో పాటు తమిళ హిందీ కన్నడ మలయాళ



భాషల్లో భారీ ఎత్తున చిత్రాన్ని విడుదల చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు మేకర్స్. అయితే తాజాగా ఈ సినిమాకు సంబంధించిన ఓ లేటెస్ట్ అప్ డేట్ వెలుగులోకి వచ్చింది. ఆదిపురుష్ ట్రైలర్ ను ఏప్రిల్ 9వ తేదీ అంటే రేపు విడుదల చేయబోతున్నారు. ఈరోజు ప్రభాస్ దగ్గరి వాళ్లు స్నేహితులకు ప్రైవేట్ గా ఈ ట్రైలర్ ను త్రీడీలో చూపించబోతున్నారట.అలాగే 9వ తేదీ అంటే మంగళవారం రోజు మధ్యాహ్నం రోజు హైదరాబాద్ లో ట్రైలర్ ను విడుదల చేస్తారట. అయితే ముంబయి వేదికగా హిందీలో కూడా విడుదల చేయబోతున్న ఈ ట్రైలర్ లాంచ్ కు ప్రభాస్ హాజరు కాబోతున్నారట. కానీ హైదరాబాద్ కు మాత్రం రారట. దీంతో అంతా ప్రభాస్ తెలుగు మీడియాను పట్టించుకోవట్లేదని తెలుస్తోంది.మొదటి సారి టీజర్ రిలీజ్ అయినప్పుడు ఈ చిత్రానికి పెద్ద ఎత్తున నెగిటివ్ టాక్ వ్చిచంది. అయితే చాలా రోజులు గ్యాప్ తీసుకొని వీఎఫ్ఎక్స్ ను మార్చి మరో కొత్త టీజర్ ను విడుదల చేసిందీ చిత్రబృందం. ఇక అప్పటి నుంచి సినిమాకు పాజిటివ్ టాక్ రావడం మొదలైంది. ట్రైలర్ కూడా బాగుంటే సినిమాకు విపరీతమైన క్రేజ్ వస్తుందని అంతా భావిస్తున్నారు. మరి చూడాలి రేపు రిలీజ్ కాబోయే ట్రైలర్ ఏ విధంగా ఉండనుందో. శ్రీరాముడి గురించి సినిమాలో ఉండడంతో పెద్ద ఎత్తున ప్రేక్షకులు చూసే వీలుందని మేకర్స్ భావిస్తున్నారు. ఈ క్రమంలోనే వీలైనన్ని ఎక్కువ థియేటర్లలో సినిమాను రిలీజ్ చేయబోతున్నారు. ఇండియా మొత్తం 8 వేల థియేటర్లు రోజుకు సుమారు 35 వేల కంటే ఎక్కువ షోలు పడే అవకాశం ఉందని ఫిల్మ్ నగర్ టాక్.టీ సిరీస్ అధినేత భూషణ్ కుమార్ అండ్ కృష్ణన్ కుమార్ దర్శకుడు ఓం రౌత్ ప్రసాద్ సుతార్ రెట్రోఫిల్స్ రాజేష్ నాయర్ తో కలిసి ప్రభాస్ హోమ్ బ్యానర్ లాంటి యూవీ క్రియేషన్స్ ఈ సినిమాను విడుదల చేస్తోంది.

# లేడీ డైరెక్టర్ సిటీ కి దూరంగా ఉండటానికి కారణం అదేనా..?



లేడీ డైరెక్టర్ గా నందిని రెడ్డి తన సత్తా చాటుతున్నారు. సమంత తో ఓ బేబీ సినిమా తీసి హిట్ అందుకున్న నందిని రెడ్డి లేటెస్ట్ గా అన్నీ మంచి శకునములే సినిమాతో రాబోతున్నారు. సంతోష్ శోభన్ మాళవిక నాయర్ లీడ్ రోల్స్ లో నటించిన ఈ సినిమా హాట్ సమ్మర్ లో కూల్ సినిమాగా వస్తుంది. ఇక ఈ సినిమా ప్రమోషన్స్ లో స్ట్రైట్ ఫ్రమ్ ది హార్ట్ అనే కాన్సెప్ట్ తో వీడియోలను రిలీజ్ చేస్తున్నారు. ప్రస్తుత కాలంలో సినిమా తీయడం గొప్ప కాదు దాన్ని ఎలా ప్రమోట్ చేస్తున్నాం అన్నదే ఇంపార్టెంట్ గా మారింది.ఇక స్ట్రైట్ ఫ్రం ది హార్ట్ వీడియోలో నందిని రెడ్డి తన ప్రొఫెషనల్ పర్సనల్ లైఫ్ గురించి మాట్లాడారు. ముఖ్యంగా సిటీకి దూరంగా ఒక అందమైన ఇంట్లో ఆహ్లాదకర మైన జీవితాన్ని గడపడం తనకు ఇష్టమని అన్నారు. సినిమా అనేది జీవితంలో ఒక భాగమే అని చెప్పిన నందిని రెడ్డి తన కు పెంపుడు జంతువులను ఎక్కువగా ప్రేమిస్తానని.. ఈమధ్యనే రెండు కుక్కల ను తీసుకున్నానని అన్నారు.ఇండస్ట్రీలోకి తాను అడుగు పెట్టిన టైం లో లేడీ టెక్నిషియన్స్ తక్కువమంది ఉన్నారని చెప్పారు. సింగిల్ మదర్ సమక్షంలో పెరిగానని.. తన మొదటి సినిమా తన తండ్రి చూడలేకపోయినందుకు బాధపడ్డానని అన్నారు. సక్సెస్ అన్నది నచ్చిన కథను నచ్చిన స్టైల్ లో చెప్పుకునే స్వేచ్ఛలోనే ఉంటుందని. అన్నీ మంచి శకునములే సినిమా ఎమోషన్స్ తో ముడిపడి ఉన్న కథ. ఈ సినిమా చాలా ప్రత్యేకమని అన్నారు. ఈ సినిమాతో తాను ఎమోషనల్ గా కనెక్ట్ అయినట్టు చెప్పారు.స్వప్న సినిమా బ్యానర్ లో స్వప్న ప్రియాంక దత్ లు ఈ సినిమా నిర్మించారు. ఈ సినిమా గురించి వారు కూడా తమ అభిప్రాయాలను పంచుకున్నారు. మితిమీరిన కమర్షియల్ ఎలిమెంట్స్ ట్విస్ట్ లు పెద్దగా లేకుండా సమ్మర్ కి అమ్మమ్మ వాళ్ల ఇంట్లో హాలీడేస్ లో గడిపే మెమొరీస్ పంచే ఫీలింగ్ ఎలా ఉంటుందో ఈ సినిమా అలా ఉంటుందని అన్నారు. రెండు కుటుంబాల మధ్య జరిగే కథగా ఈ సినిమా మనసుకి హత్తుకునేలా ఉంటుందని అన్నారు నిర్మాతలు. మే 18న రిలీజ్ అవుతున్న ఈ సినిమా ప్రేక్షకుల మనసులు గెలుస్తుందో లేదో చూడాలి.

# 'బెస్ట్' మెస్సీ, షెల్లీ ఫ్రేజర్! రొనాల్డో బాటలోనే మెస్సీ.. కళ్లు చెదిరే మొత్తంతో..

పారిస్: గత ఏడాది అంతర్జాతీయ క్రీడా వేదికపై తమదైన ముద్ర వేసిన ఫుట్‌బాల్ స్టార్ లియోనెల్ మెస్సీ (అర్జెంటీనా), మహిళా అథ్లెట్ షెల్లీ ఆన్ ఫ్రేజర్ (జమైకా)లకు ప్రతిష్టాత్మక లారియస్ గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డులు లభించాయి.2022 సంవత్సరానికిగాను పురుషుల విభాగంలో ఉత్తమ క్రీడాకారుడిగా మెస్సీ... మహిళల విభాగంలో



ఉత్తమ క్రీడాకారిణిగా షెల్లీ ఎంపికయ్యారు.మెస్సీ సారథ్యంలో గత ఏడాది అర్జెంటీనా జట్టు 36 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఫుట్‌బాల్ ప్రపంచకప్ టైటిల్‌ను మూడోసారి సొంతం చేసుకుంది. ఈ టోర్నీలో మెస్సీ ఏడు గోల్స్ చేయడంతోపాటు సహచరులు మూడు గోల్స్ చేయడానికి సహాయపడ్డాడు. ఈ మెగా ఈవెంట్‌లో ఉత్తమ ప్లేయర్‌గా నిలిచి 'గోల్డెన్ బాల్' పురస్కారాన్ని కూడా దక్కించుకున్నాడు.లారియస్ అవార్డు రావడం మెస్సీకిది రెండోసారి. 2020లోనూ మెస్సీకి ఈ పురస్కారం దక్కింది. మరోవైపు షెల్లీ ఆన్ ఫ్రేజర్ 100 మీటర్ల విభాగంలో ఐదోసారి ప్రపంచ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాన్ని సాధించింది. ఓవరాల్‌గా షెల్లీ మూడు ఒలింపిక్స్ పసిడి పతకాలను, పది ప్రపంచ చాంపియన్‌షిప్ బంగారు పతకాలను గెల్చుకుంది.స్పెయిన్ టెన్నిస్ యువతార కార్లోస్ అల్‌కరాజ్‌కు 'బ్రేక్‌త్రూ ఆఫ్ ద ఇయర్' అవార్డు లభించింది. గత ఏడాది అల్‌కరాజ్ యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో విజేతగా నిలువడంతోపాటు ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకున్నాడు. 1999 నుంచి లారియస్ గ్లోబల్ స్పోర్ట్స్ అవార్డులను అందజేస్తున్నారు.పోర్చుగల్ ఫుట్‌బాల్ స్టార్ క్రిస్టియానో రొనాల్డో బాటలోనే మెస్సీ నడవనున్నాడు. ప్రస్తుతం ఫ్రాన్స్‌లో పారిస్ సెయింట్ జెర్మయిన్ (పీఎస్‌జీ) క్లబ్‌కు ఆడుతున్న మెస్సీ ఈ సీజన్ తర్వాత పీఎస్‌జీని వీడి రొనాల్డో ఆడుతున్న సౌదీ అరేబియా లీగ్‌లో అడుగు పెట్టనున్నాడు. ఇప్పటికే సౌదీ అరేబియా లీగ్‌లోని ఒక క్లబ్ మెస్సీతో కళ్లు చెదిరే మొత్తానికి ఒప్పందం చేసుకుందని సమాచారం.తాష్కెంట్: ప్రపంచ పురుషుల బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో ఇద్దరు భారత బాక్సర్లు నిశాంత్ దేవ్ (71 కేజీలు), దీపక్ భోరియా (51 కేజీలు) పతకం ఖరారు చేసుకోవడానికి మరో విజయం దూరంలో ఉన్నారు.మంగళవారం జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్ బౌట్‌లలో దీపక్ 5-0తో జాంగ్ జియామావో (చైనా)పై గెలుపొందగా... నిశాంత్ దేవ్ పంచ్‌ల ధాటికి అతని ప్రత్యర్థి ఫొకాహ నిదాల్ (పాలస్తీనా) చేతులెత్తేశాడు. నిశాంత్ పంచ్ పవర్‌కు తొలి రౌండ్‌లోనే ఫొకాహ రింగ్‌లో రెండుసార్లు కూలబడ్డాడు.దాంతో రిఫరీ బౌట్‌ను నిలిపివేసి నిశాంత్‌ను విజేతగా ప్రకటించాడు. మరోవైపు భారత్‌కే చెందిన సచిన్ సివాచ్ (54 కేజీలు), ఆకాశ్ సాంగ్వాన్ (67 కేజీలు)ల పోరాటం ప్రిక్వార్టర్ ఫైనల్లో ముగిసింది. సచిన్ 0-5తో సాబిర్ ఖాన్ (కజకిస్తాన్) చేతిలో, ఆకాశ్ 0-5తో దులాత్ (కజకిస్తాన్) చేతిలో ఓడిపోయారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY AVULA VIJAYA BHASKARA REDDY PRINTED AT SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2, OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL - 518 001. ANDHRA PRADESH.
PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY, 7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190